



అధ్వాన స్థితిలో నరసరావుపేటలోని కలెక్టరేట్ పక్కన ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం



నిధులున్నా.. మరమ్మతులు మమ

- ఎస్సీ వసతిగృహాల నిర్వహణపై నిర్లక్ష్యం
- మూడు నెలల క్రితం రూ.11.43 కోట్లు విడుదల
- పల్నాడు జిల్లాలో దారుణంగా పనుల తీరు
- గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అరకొరగానే..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రూపురేఖలు కోల్పోయిన మరుగుదొడ్లు.. పెచ్చులు ఊడు తున్న శ్లాబ్‌లు.. మెష్‌లు లేని కిటికీలు.. తలుపులు లేని గదులు.. కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దోమల మధ్య.. ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు అల్లాడుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ హాస్టళ్ల నిర్వహణను గాలికి వదిలేశారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల ఇబ్బందులను పరిష్కరించేందుకు హాస్టళ్లలో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించింది. విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడంతో పాటు వసతిగృహాల్లో సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చి నిధులు విడుదల చేసింది. అయితే సదరు పనులు చేపట్టడంలో అధికారుల్లో అడుగడుగునా అలసత్వం తాండవిస్తోంది. నిధులు ఉన్నా మరమ్మతులు పూర్తి చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. మూడు నెలల క్రితమే నిధులు విడుదలైనా నేటికి చాలా దగ్గర్ల పనులు చేపట్టలేదంటే అధికారుల అలసత్వం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నా పట్టించుకోవడంలేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలోని 53 వసతి గృహాల్లో మరమ్మతులకు రూ.11.43 కోట్లు నిధులు విడుదలయ్యాయి. అయితే చాలా చోట్ల పనులు చేపట్టలేదని సాంఘిక సంక్షేమశాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. పల్నాడు జిల్లాలో 16 వసతి గృహాలకు నిధులు కేటాయించినా ఒక్క దగ్గర కూడా పనులు పూర్తి చేయలేదు. గుంటూరు జిల్లాలో 23 వసతి గృహాలకు చాలా వసతిగృహాల్లో 50 శాతం పనులే జరిగాయి. బాపట్ల జిల్లాలో అన్ని వసతి గృహాల్లో పనులు చేపట్టగా మూడు చోట్ల 25 శాతం లోపు, 11 వసతి గృహాల్లో 50 శాతం లోపు పనులు జరిగాయి. పనులు జరుగుతున్న తీరు పరిశీలిస్తే ఇప్పట్లో అవి పూర్తయ్యే పరిస్థితి లేదని అర్థమవుతోంది. జూన్‌లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో అప్పటి కల్లా మరమ్మతులు పూర్తి చేసేందుకు అధికారులు స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లా	వసతి గృహాలు	నిధులు (రూ.కోట్లలో)
పల్నాడు	16	2.76
గుంటూరు	23	4.13
బాపట్ల	14	4.54

ఖాళీ ప్లాట్లపై కుస్తీ

- స్థలాలిచ్చి.. నిర్మాణంపై మడమ తిప్పిన గత ప్రభుత్వం
- ఇళ్లు కట్టుకోలేక ఖాళీగా వదిలేసిన పలువురు లబ్ధిదారులు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 27,283 ప్లాట్లు ఖాళీ
- ఇళ్ల మధ్యలో స్థలాలతో సమస్యాత్మకంగా సర్దుబాటు

కష్టతరంగా జగనన్న కాలనీల్లోని స్థలాల సర్దుబాటు

కాలనీలు కాదు ఊళ్లు నిర్మిస్తున్నాం.. స్థలాలే కాదు ఇళ్లు కూడా కట్టిస్తాం.. సకల సౌకర్యాలతో పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం.. అని గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో లే అవుట్లు వేసి లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేసింది. అయితే అప్పట్లో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణంపై మాటమార్చింది. దీంతో పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఇలాంటి ఖాళీ ప్లాట్లు జగనన్న కాలనీలోని ప్రతీ లేఅవుట్లో వందల్లో ఉన్నాయి. ఖాళీ ప్లాట్లపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర ప్లాట్లు 27,283 ఖాళీగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి పంపిణీకి ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీచేసింది. అయితే ఇళ్ల మధ్య.. ఊళ్లకు దూరంగా.. కనీస సౌకర్యాలు లేని.. చిట్టడవులను తలపిస్తోన్న.. వర్షం పడితో చెరువుల్లా మారే లేఅవుట్లలోని ప్లాట్లను ఏమి చేయాలో.. ఎలా సర్దుబాటు చేయాలనే విషయంపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు పేరుతో పేదల కోసం అంటూ జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి స్థలాలను పంపిణీ చేసింది. పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర చొప్పున స్థలాలు కేటాయించింది. అయితే ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు ముందుకు రాలేదు. కొందరు స్తోమతకు మించి అప్పులు చేసినా ఇళ్లను పూర్తిగా నిర్మించుకోలేక వదిలేశారు. దీంతో ఆయా కాలనీలు మొండిగోడలకు పరిమితమైన ఇళ్లు, పునాదుల దశలోనే ఉన్న ఇళ్లు.. అసలు నిర్మాణాలకే నోచుకోని ఖాళీ స్థలాలతో జగనన్న కాలనీలు దర్శనమిస్తున్నాయి. అరకొర నిర్మాణాలతో ఉన్న ఇళ్లను పక్కన పెట్టి ప్రస్తుతానికి ఖాళీ స్థలాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే ఆ ఖాళీ స్థలాల సర్దుబాటు ప్రక్రియ అటు ప్రభుత్వానికి ఇటు రెవెన్యూ అధికారులకు కొత్త తలనొప్పులు తెచ్చి పెడుతోంది. ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాలను, సగం నిర్మాణాలున్న స్థలాలను ఎలా సర్దుబాటు చేయాలో తెలియక అధికారులు సతమతమవుతున్నారు. దీంతో స్థలాల సర్దుబాటు వ్యవహారం ఒక ప్రహసనంగా మారుతోంది. మొత్తంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 27,283 ఖాళీ స్థలాలు ఉన్నాయి. జగనన్న లేఅవుట్లలో ఖాళీగా పడి ఉన్న స్థలాలను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున పేదలకు స్థలాలను సర్దుబాటు చేయాల్సిందిగా రెవెన్యూ శాఖను ఆదేశించింది. అయితే ఆ ప్రకారం సర్వే చేస్తున్న అధికారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఒక లే అవుట్లో కొంత మంది ఇళ్లు కట్టుకుంటే.. మరికొందరు ఇళ్లు కట్టుకునే స్తోమత లేక ప్రభుత్వ సహాయం అందక ప్లాట్లను ఖాళీగా వదిలేశారు. అలా వదిలేసిన స్థలాలు చాలా వరకూ ఇళ్ల మధ్యలో ఉన్నాయి. ఈ సాంకేతిక సమస్య కారణంగా ప్రభుత్వం చెప్పిన 2, 3 సెంట్లు చొప్పున సర్దుబాటు చేసేందుకు వీలుపడడం లేదు. మరోవైపు ఆ స్థలాలనే వేరొకరికి ఇద్దామంటే, ప్రభుత్వం ప్రకటించిన స్థలాల కంటే చిన్నవి కావడంతో వాటిని తీసుకోవడానికి ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఆయా ఖాళీ ప్లాట్లను ఏమి చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సర్దుబాటు వ్యవహారం ఎప్పటికి కొలిక్కి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

కట్టుకోలేక వదిలేశారు

గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో స్థలాలు ఇచ్చి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రూ.1.80 లక్షలతో ఇల్లు కట్టుకోవాలని సూచించింది. రాష్ట్రం వాటా కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఆ డబ్బుతో ఇళ్లు కట్టుకోలేక నిరుపేదలు అనేక మంది స్థలాలను ఖాళీగా వదిలేశారు.

- గుంటూరు జిల్లాలో 247 లేఅవుట్లలో 73,932 ప్లాట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 63,823 ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా,శంకుస్థాపనకు నోచుకోకుండా 10,109 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో గత ప్రభుత్వం వేసిన జగనన్న కాలనీల్లోని లే అవుట్లలో 29,854 మందికి ప్లాట్లు ఇచ్చారు. అయితే 10,500 మంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోలేక వదిలేశారు.
- పల్నాడు జిల్లాలో 39,642 ప్లాట్లు వేసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అయితే 9,481 ఇళ్లు పునాదుల దశలోనే ఉన్నాయి. 6,674 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాకపోవడంతో ఖాళీగా ఉన్నాయి.

లబ్ధిదారులకు రూ.50 వేలు

ఇళ్ల పనులు ప్రారంభించి మధ్యలో వదిలేసిన స్థలాలను సర్దుబాటు చేసే అవకాశం లేకపోవ డంతో లబ్ధిదారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.50 వేల సహాయాన్ని ప్రకటించింది. గుంటూరు జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు 14,112 మందికి, బాపట్ల జిల్లాలో 15,334 మందికి, పల్నాడు జిల్లాలో 14,106 మందికి అదనపు ఆర్థిక సహాయం చేయనుంది.



అదనపు సహాయంతో ప్రోత్సాహం

నిర్మాణం మొదలైన స్థలాలను సర్దుబాటు చేయడం వీలుకాని నేపథ్యంలో ప్రభుత్వం లబ్ధిదారులకు అదనపు సహాయం ప్రకటించి ఆ ఇళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా చేయూత ఇస్తుందని ఆశతో గతంలో మొదలుపెట్టిన అనేకమంది ఇళ్లు కట్టుకోలేక మధ్యలో ఆపేశారు. గుంటూరు జిల్లాలో 51,579 ఇళ్లు ఇంకా పూర్తి కావాల్సి ఉండగా 34,527 ఇళ్లు పునాదుల దశలోనే ఉన్నాయి. బాపట్ల జిల్లాలో సొంత స్థలాలున్న 20 వేల మందితో కలిపి 50,457 ఇళ్లు నిర్మించ తలపెట్టగా వాటిలో 32 వేలు అసంపూర్తిగా ఉన్నాయి. అందులో సగం జగనన్న కాలనీల్లోనే ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 23,852 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. అయితే గతంలో గృహ రుణం మంజూరై ఇళ్లు నిర్మించుకోకుండా ఖాళీగా వదిలేసిన స్థలాలకు ప్రస్తుత ప్రభుత్వం అందజేసే సర్దుబాటు వర్తించదని అధికారులు చెబుతున్నారు.

సూర్యలంకకు మహర్దశ



- బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు
- అంతర్జాతీయ ప్రమాణాలతో సొబగులు
- బీచ్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి
- 45 రోజుల్లో నిధులు.. కేంద్రానిదే పూర్తి బాధ్యత : కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

బాపట్ల, గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సుందరమైన సూర్యలంక బీచ్ అత్యాధునికంగా.. సకల సౌకర్యాలతో.. పర్యాటకులను మరింత ఆహ్లాదప రచనున్నది. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద సూర్యలంక బీచ్ అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక సొబగులు అద్దుకోనుంది. బీచ్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టు కింద సూర్యలంక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద రూ.97.52 కోట్లు మంజూరు చేసింది. సూర్యలంక బీచ్‌కి సంబంధించి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేకంగా దృష్టి సారించి 45 రోజుల్లోనే నిధులు సాధించడంలో కీలకంగా వ్యవహరించారు. ఫిబ్రవరిలో కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు లేఖ రాసిన పెమ్మసాని పలుమార్లు ఆయనను వ్యక్తిగతంగా కలిసి ఈ ప్రాజెక్టుకు సంబంధించి వివరాలు అందజేసి నిధులు రాబట్టడంలో విజయం సాధించారు. కేంద్రం విడుదల చేసిన నిధులను 7 అంశాలపై ఖర్చు చేయనున్నారు. రూ.15.43 కోట్లతో పర్యాటకుల అనుభూతిని పెంచేలా కార్యక్రమాలు, రూ.4.4 కోట్లతో షాపింగ్ స్ట్రీట్, రూ.7.8 కోట్లతో రవాణా సదుపాయాలు, రూ.11.69 కోట్లతో బీచ్ సమీపంలోని కాల్వ అభివృద్ధి, రూ.19.4 కోట్లతో ఎక్స్‌పీరియన్స్ జోన్, రూ.12.8 కోట్లతో సదుపాయాలు, రూ.5.97 కోట్లతో సౌకర్యాలు అందుబాటులోకి తేనున్నారు. సూర్యలంకకు ప్రాజెక్టు మంజూరు చేయించడం తనకు చాలా ఆనందంగా ఉందని పెమ్మసాని గురువారం తెలిపారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే పూర్తి ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

సమకూరే వసతులు..

- బ్లూఫ్లాగ్ గుర్తింపు దక్కేలా వసతుల కల్పన
- కొత్తగా రిసార్టుల నిర్మాణం, తాత్కాలిక గదుల ఏర్పాటు
- పర్యాటకులను ఆకర్షించేలా బీచ్ ఆధునికీకరణ
- దేశీయ సాంప్రదాయ ఫుడ్ స్టాళ్లు, షాపింగ్ స్ట్రీట్ ఏర్పాటు
- పిల్లలకోసం ప్రత్యేక ఆట వస్తువులు, పార్కు నిర్మాణం

చక్రం తిప్పిన పెమ్మసాని..

స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద కేంద్రం తొలుత రూ.600 కోట్ల బడ్జెట్‌తో దేశ వ్యాప్తంగా ఆరు ప్రాజెక్టులను చేపట్టింది. ఈ పథక నిర్వహణలో సాంకేతిక సర్దుబాట్ల బాధ్యతను పెమ్మసాని ప్రత్యేకంగా చేపట్టారు. ఈ క్రమంలో ఆరు ప్రాజెక్టులను 14 ప్రాజెక్టులుగా మార్పు చేయించారు. బడ్జెట్‌ను కూడా రూ.600 నుంచి 1,000 కోట్లకు పెంచేలా చేశారు. సూర్యలంక బీచ్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టును కూడా ఇందులో జత చేయించడంలో పెమ్మసాని చక్రం తిప్పారు. సూర్యలంక బీచ్ ప్రాముఖ్యత, పర్యాటకంగా పెరగనున్న ఆదరణ, తదితర వివరాలను సవివరంగా డీపీఆర్ ద్వారా కేంద్ర పర్యాటకశాఖకు పలుమార్లు పెమ్మసాని వివరించడంతో సంతృప్తి వ్యక్తం చేసిన కేంద్రం నిధులను విడుదల చేసింది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (శుక్రవారం సాయంత్రం)
సహరి : 4.49 (శనివారం ఉదయం)

కలెక్టర్ ఆదేశాలూ.. బేఖాతర్

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సరెండర్
- రిలీవ్‌కాని ఈఎస్.. త్రిశంకుస్వర్గంలో ఆదేశాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)



ఈఎస్ దేవదత్తు

మద్యం షాపుల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనలతో పాటు సమయపాలన పాటించకుండా కొన్ని దుకాణాల్లో 24 గంటలు మద్యం అందుబాటులో ఉండడం వంటి ఫిర్యాదులపై స్పందించిన కలెక్టర్ వెంకటమురళి సీరియస్ అయ్యారు. బెల్ట్ షాపుల కట్టడిలో ఎక్సైజ్ విభాగం దృష్టి సారించడం లేదనే నివేదికలు కూడా కలెక్టర్‌కు అందాయి. వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఈఎస్ దేవదత్తును కలెక్టర్ గతంలో ఆదేశించారు. కానీ దేనికీ ఆయన స్పందించకపోవడంతో పాటు విధి నిర్వహణలో అలసత్వం, సమీక్షలకు హాజరుకాకపోవడం వంటి కారణాలతో ఈఎస్ దేవదత్తును కమిషనరేట్‌కు సరెండర్ చేస్తూ ఈ నెల 24న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఏఈఎస్ వెంకటేశ్వర్లుకు ఇన్‌చార్జి ఆదేశాలను కూడా కలెక్టర్ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం రిలీవ్ కావాల్సిన దేవదత్తు తాత్సారం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన రిలీవ్ కాకుండానే ఏఈఎస్ మరో వైపు ఇన్‌చార్జి విధులు నిర్వహిస్తుండడంతో సరెండర్ ఆదేశాలు డోలాయమానంలో ఉన్నాయి. తానిచ్చిన ఉత్తర్వులనే ఈఎస్ బేఖాతర్ చేయడంపై కలెక్టర్ ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయమే దేవదత్తును వివరణ కోరగా సరెండర్ నోటీసులు తనకు అందాయని, కానీ కమిషనరేట్ నుంచి తనకు ఎలాంటి మౌఖిక ఆదేశాలు కానీ ఉత్తర్వులు కానీ రాలేదని అందుకే రిలీవ్ కాలేదని చెప్పారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా...

బెల్ట్ షాపుల కట్టడి, ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.కానీ జిల్లా పరిధిలోని అనేక షాపుల్లో ఈ నిబంధనలు అమలు జరగడంలేదు. బాటిల్ రూ.20 నుంచి రూ.30 వరకు పెంచి అమ్మకాలు జరుపుతున్నారు. వాటిని కట్టడి చేయడంలో ఎక్సైజ్ శాఖ వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది. నిబంధనలు పాటించని మద్యం షాపుల యజమానులపై జరిమానాలు విధించాలని, వరుసగా మూడు సార్లు ఎక్సైజ్ విభాగానికి పట్టుబడితే లైసెన్సు రద్దు చేయడానికి కూడా వెనకాడొద్దనేది ప్రభు త్వ ఆదేశాలు. నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతున్నా ఎక్సైజ్ విభాగం ఇప్పటి వరకు జరిమానా వేసిన దాఖలాలు లేవు. పైగా నాటుసారా కట్టడిలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఇవన్నీ కలిసి ఎక్సైజ్ సూపరిటెండెంట్ సరెండర్‌కు దారి తీశాయని తెలుస్తోంది.

పంచాయతీ ఉప ఎన్నికలు.. ప్రశాంతం

వైసీపీ ఖాతాలోనే పిట్టలవానిపాలెం ఎంపీపీ

మూడు ఉప సర్పంచ్‌లు టీడీపీ మద్దతుదారులు కైవసం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వివిధ కారణాలతో పంచాయతీల్లో ఏర్పడిన ఖాళీలకు గురువారం ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఓ ఎంపీపీ స్థానంతో పాటు కో ఆప్టెడ్ సభ్యుడి ఎన్నిక, నాలుగు ఉప సర్పంచ్‌ల ఖాళీలు ఇందులో ఉన్నాయి. అందరి దృష్టి కేంద్రీకృతమైన పిట్టలవానిపాలెం ఎంపీపీ స్థానాన్ని వైసీపీ చేజిక్కించుకుంది. ఎంపీపీగా పిట్టువారిపాలెం ఎంపీటీసీ దెందుకూరి సీతారామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భట్టిప్రోలు మండల పరిధిలోని కో ఆప్టెడ్ సభ్యుడిగా ఆ పార్టీ బలపరిచిన వ్యక్తే ఎన్నికయ్యారు. నాలుగు ఉప సర్పంచ్‌లకు ఎన్నిక జరగ్గా మూడు ఏకగ్రీవం కాగా ఒక చోట ఎన్నిక అనివార్యమైంది. భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ ఉపసర్పంచ్ స్థానానికి ఎన్నిక జరగ్గా టీడీపీ బలపరిచిన గొ్ర రెపాటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. రేపల్లె మండలంలోని పేటేరు ఉపసర్పంచ్‌గా కనికచర్ల శ్రీదేవి, చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం ఉపసర్పంచ్‌గా పెరుగు వెంకటశివనాగేశ్వరరావులను ఎన్నుకున్నారు.

గుంటూరు-నడికుడి మార్గంలో రైళ్ల వేగం 130 కి.మీ 5

సీఎం పర్యటన ఏర్పాట్లు వేగవంతం

- కొత్తగొల్లపాలెంలో 1న చంద్రబాబు పింఛన్లు పంపిణీ
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ దూడీ

చినగంజాం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగంజాం పంచాయతీ ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 1వ తేదీన పేదల సేవలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను గురువారం ఎస్పీ తుషార్‌డూడీ, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న హెలి ప్యాడ్ స్థలం, సభా ప్రాంగణాన్ని, పెన్షన్ల పంపిణీ లబ్ధిదారుల గృహాలను, టీడీపీ కార్యకర్తలతో నిర్వహించే సమావేశ ప్రాంతాన్ని, వీఐపీ వాహనాల పార్కింగ్ స్థలాన్ని, కాన్వాయ్ వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రచ్చబండ వద్ద అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో అధికారులు నిర్వహించాల్సిన విధులను తెలిపారు. రెండు వేల మంది ప్రజలు కూర్చోవడానికి అనుకూలంగా సభాప్రాంగణం ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా వేదిక వద్ద జీరో ప్రాపర్టీ గురించి రెండు స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావును ఆదేశించారు. సుమారు నాలుగు గంటల పాటు జరిగే సీఎం కార్యక్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలు, ట్రాఫిక్ ఏర్పాట్లపై అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, చీరాల డీఎస్పీ మొయిన్, డీపీవో ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ దూడీ

ఎల్1 కంపెనీలపై గప్‌చుప్!

- ఆరోగ్య శాఖలో రహస్యంగా టెండర్ల ఖరారు
- ప్రక్రియపై ఎమ్మెల్యేల ఫిర్యాదు.. విచారణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వాసుపత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ నిర్వహణకు టెక్నికల్ కమిటీ టెండర్లను ఖరారు చేసింది. ఏయే కంపెనీలను ఎంపిక చేశారన్న విషయాన్ని మాత్రం అధికారులు బయటకు రానివ్వడం లేదు. ఎల్1 కంపెనీల పేర్లు బయట పెట్టకుండా రహస్యంగా ఉంచారు. గురువారం ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ నేతృత్వంలో కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో ఉన్న ఆసుపత్రులకు సంబంధించి మొత్తం 18 ప్యాకేజీలకు టెండర్లు ఖరారు చేశారు. అన్ని జోన్‌లకు ఎల్1 కంపెనీలను ఎంపిక చేశారు. ఇప్పటికే ఈ టెండర్ ప్రక్రియపై అనేక అనుమానాలు, ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్1 కంపెనీల పేర్లు రహస్యంగా ఉంచడం మరిన్ని సందేహాలకు తావిస్తోంది. దీనికితోడు ఏపీఎంఎస్ఐడీసీ టెండర్ ప్రక్రియ మొత్తాన్ని గందరగోళం చేసింది. శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ టెండర్లు మొత్తం మెడికల్ టెర్మనాలజీ, కెమికల్స్ వ్యవహారాల్లో అనుభవం ఉన్న అధికారికి అప్పగించాలి. అయితే దాదాపు రూ.1400 కోట్లు విలువైన టెండర్ల విషయంలో సాధారణ ఇంజనీర్‌కు అప్పగించారు. సదరు అధికారి తనకు నచ్చినట్లు టెండర్ నిబంధనలతో కంపెనీలకు అర్హత కల్పించారన్న విమర్శలున్నాయి. టెండర్ల ప్రక్రియపై ఉత్తరాంధ్ర, రాయలసీమ ఎమ్మెల్యేలు అనేక మంది ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

నిబంధనలు మార్పు

శానిటేషన్, సెక్యూరిటీ టెండర్లల్లో నిబంధనలను అధికారులు ఇష్టారాజ్యాంగా మార్చేశారు. అధికారులు టెండర్ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన నిబంధనలకు వారే తిలోదకాలు ఇచ్చారు. తొలుత టెండర్ డాక్యుమెంట్‌లో జోన్‌ల వారీగా ఎంతమంది శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి? వారికి ఎంత జీతం ఇవ్వాలి? ఎంత మొత్తంలో కెమికల్స్ ఉపయోగించాలి? దానికి అయ్యే ఖర్చు ఎంత? అన్న వివరాలు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు పొందుపరిచారు. బిడ్ దాఖలు చేసే కంపెనీ కేవలం సర్వీస్ చార్జీ ఎంత అన్న విషయాన్ని మాత్రమే బిడ్‌లో పొందుపరచాలని స్పష్టంగా చెప్పారు. దాని ఆధారంగానే ఎల్1 కంపెనీ ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. అది కూడా సర్వీస్ చార్జీ 3.38 శాతం నుంచి 7.7 శాతం మించకూడదన్న నిబంధన పెట్టారు. చివరికి బిడ్ దాఖలు చేసే సమయంలో జోన్ల వారీగా ఎంతమంది సిబ్బందిని నియమిస్తారు? వారికి ఎంత మొత్తంలో జీతాలు చెల్లిస్తారు? ఎంత మొత్తంలో కెమికల్స్ ఉపయోగిస్తారు? అన్న వివరాలు కూడా పొందుపరచాలన్న నిబంధనలు పెట్టారు.

ఫిర్యాదులు పరిశీలిస్తాం

టెండర్ ప్రక్రియలో పాల్గొన్న ఒక కంపెనీపై కొంతమంది ఎమ్మెల్యేలు ఫిర్యాదులు చేశారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ చేస్తాం, ఆ తర్వాత టెండర్ ప్రక్రియపై ముందుకు వెళ్తామని ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు తెలిపారు.

16 రోజులు డిటెన్షన్ సెల్‌లో!

- రాత్రి నిద్రపోకుండా లైట్లు వేసి ఉంచారు... బల్లులు, పురుగులతో నిద్రలేమి
- పగటిపూట చెట్టు కింద పడుకున్నా... తెలంగాణ సీఎం రేవంత్ ఆవేదన



హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తనది కక్ష సాధించే మనస్తత్వమే అయితే మొత్తం కేసీఆర్ కుటుంబం ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉండేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి కక్ష, పగ, ప్రతీకారాలకు పోతున్నారని బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన ఆరోపణలపై సీఎం తీవ్రంగా స్పందించారు. తాము నిజంగా కక్ష సాధింపునకు పాల్పడితే తనను ఉంచిన చంచల్‌గూడ జైల్లోనో, చర్లపల్లి జైల్లోనే బీఆర్ఎస్ నాయకులు ఉండేవారని అన్నారు. "డ్రోన్ ఎగరేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. బీఆర్ఎస్ వాళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎంపీనని కూడా చూడకుండా నన్ను చర్లపల్లి జైల్లో పెట్టారు. కరుడు గట్టిన నేరగాళ్లను బంధించినట్లు బంధించారు. 16 రోజులపాటు కంటికి మనిషి కనిపించకుండా నక్సల్స్‌ను ఉంచే డిటెన్షన్ సెల్లో ఉంచారు. జైల్లో రాత్రంతా లైట్లు ఆన్‌లో పెట్టి ఒక్క రాత్రి కూడా పడుకోకుండా చేశారు. దీపాల వెలుగుకు బల్లులు, పురుగులు వచ్చి చేరడంతో బలవంతంగా కళ్లు మూసుకున్నా నిద్ర వచ్చేది కాదు. దాంతో పగలు చెట్టు కింద పడుకుని నిద్రపోయేవాడిని. వాళ్ల తప్పులను దేవుడే చూస్తాడని, అంతకు అంత అనుభవిస్తారని భావించి ఊరుకున్నా. నా మీద కక్ష చూపిన వారిని దేవుడే ఆసుపత్రి పాలు చేశాడు" అన్నారు. 2015లో చంచల్‌గూడ జైల్లో ఉన్నపుడు తన బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి బెయిలు కోసం ప్రయత్నిస్తుంటే ఢిల్లీ నుంచి న్యాయవాదులను పిలిపించి వాదనలు చేసి అడ్డుకున్నారని గుర్తు చేశారు. జైలు నుంచి నేరుగా వేదిక వద్దకు వెళ్లి, తిరిగి జైలుకు తీసుకొచ్చారన్నారు. రాజకీయ కక్ష సాధింపులంటే మీవి కదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఇంత జరిగినా కక్ష సాధింపులకు పాల్పడకుండా విజ్ఞత ప్రదర్శించామని చెప్పారు. కేటీఆర్ తన ఆఫీసులో కొంత మందికి డబ్బులిచ్చి తనను, కుటుంబ సభ్యులను బూతులు తిట్టించి, రికార్డు చేయించిన వారిని చెంప పగులగొట్టే శక్తి ఉన్నా ఓపికతో ఉన్నా. కక్ష సాధింపు చర్యలు ఎవరివో తెలంగాణ సమాజం గమనిస్తోందని అన్నారు.

ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా అసైన్డ్ కమిటీలు

అమరావతి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసైన్డ్, మిగులు భూముల పంపిణీ వంటి అంశాలను సమీక్షించేందుకు ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు చైర్మన్లుగా ప్రభుత్వం కమిటీలను పునరుద్ధరించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా గురువారం ఉత్తర్వు(జీఓ104) జారీ చేశారు. జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించే మంత్రులు, సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆర్డీఓ లేదా సబ్ కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు. జిల్లా స్థాయిలో భూ వ్యవహారాలను పర్యవేక్షించే జాయింట్ కలెక్టర్ ఈ కమిటీ సభ్య కన్వీనర్‌గా ఉంటారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే, తాజాగా ఈ కమిటీలో జిల్లా కలెక్టర్‌కు అవకాశం ఇవ్వలేదు. జిల్లా స్థాయిలో ఖాళీగా ఉన్న భూములను రెవెన్యూ శాఖ సిఫారసుల మేరకు ఈ కమిటీ పరిశీలించి అర్హులైన పేద లబ్ధిదారులకు పంపిణీ చేస్తుంది. మాజీ సైనికులకు ఇచ్చే భూములనూ ఈ కమిటీనే ఖరారు చేయనుంది.

ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్‌కు 88 కోట్లు

బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం పరిసవారిపాలెంలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ఏర్పాటు కోసం రూ.88.08 కోట్ల మంజూరుకు ప్రభుత్వం పరిపాలన ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద కేంద్రం రూ.52.85 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.35.23 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్‌లో ఆమోదిత నిర్మాణాలను షరతులకు లోబడి పూర్తి చేయాలని మత్స్యశాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

మాస్ లుక్‌లో...



రామ్‌చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. గురువారం రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులను ఖుషీ చేశారు మేకర్స్. సినిమాకు 'పెద్ది' అనే టైటిల్‌ను ఖరారు చేసి, రామ్‌చరణ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. గుబురు గడ్డంతో చుట్ట వెలిగిస్తూ మాస్ లుక్‌లో కనిపించారు. ఈ లుక్ సినిమాపై ఉన్న అంచనాలను మరింత రెట్టింపు చేసింది. క్రీడా నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. జగపతిబాబు, కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణ సంస్థలు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

సినీ ప్రముఖుల శుభాకాంక్షలు

రామ్‌చరణ్‌కు సినీ ప్రముఖులు సోషల్‌మీడియా వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "పుట్టిన రోజు శుభాకాంక్షలు చరణ్. 'పెద్ది'లో నీ లుక్ అదిరిపోయింది. నీలోని నటుడిని ఈ సినిమా మరింత కొత్తగా చూపించనుందనే నమ్మకం ఉంది. సినీ ప్రియులకు కన్నుల పండుగగా ఉండే ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చిరంజీవి పేర్కొన్నారు. అలాగే ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మహేశ్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, సాయి దుర్గాతేజ్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ కాజల్ అగర్వాల్ తదితరులు రామ్‌చరణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెప్తూ పోస్టులు పెట్టారు.

జూన్ 2న ఇళయరాజాకు సన్మానం



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను తమిళనాడు ప్రభుత్వం జూన్ రెండో తేదీన సన్మానించనుంది. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం శాసనసభలో ప్రకటించారు. ఇళయరాజా 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆయన పుట్టిన రోజైన జూన్ రెండో తేదీన ఈ వేడుకలను నిర్వహించనున్నట్టు సీఎం చెప్పారు. వీసీకే సభ్యుడు చింతనై సెల్వం మాట్లాడుతూ.. 'సంగీత దర్శకుడు ఇళయరాజా తన సింఫనీ అరంగేట్రం కార్యక్రమాన్ని లండన్ వేదికగా విజయవంతంగా పూర్తి చేశారని, ఆ సింఫనీని తమిళ ప్రజలు వినేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందా? అని ప్రశ్నించారు. దీనికి సీఎం స్టాలిన్ సమాధానమిస్తూ.. 'సింఫనీ అరంగేట్రాన్ని పూర్తి చేసుకుని వచ్చిన ఇళయరాజాకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సాదర స్వాగతం పలికాం. సింఫనీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో నిర్వహించాలని కోరాం. తక్షణం 4 వేల మంది కళాకారులను రాష్ట్రానికి పిలిపించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం శ్రమతో కూడుకున్నపని అని ఇళయరాజా అన్నారు' అని సీఎం తెలిపారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఫలితాలు కూడా చెత్తగానే ఉంటాయి



సల్మాన్ ఖాన్

చెత్త సినిమాలు తీస్తే ఫలితాలు కూడా చెత్తగానే ఉంటాయి అంటూ.. బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన నటించిన తాజా చిత్రం 'సికందర్' ఈనెల 30న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో మాట్లాడుతూ 'సరైన చిత్రాలు తెరకెక్కించలేనప్పుడు అవి బాక్సాఫీసు వద్ద పరాజయాలే మూటగట్టుకుంటాయి. అందరూ కలసి కష్టపడితేనే మంచి సినిమా వస్తుంది. అయినప్పటికీ హీరో ఫొటోను మాత్రమే పోస్టర్‌లో వేస్తారు. ప్రేక్షకులు కూడా అది చూసే థియేటర్లకు వస్తుంటారు. ఒకవేళ సినిమా ఫ్లాప్ అయితే అందరూ ఆ హీరోనే తప్పుపడతారు' అని సల్మాన్ ఖాన్ వ్యాఖ్యానించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



ఆ మాటలు నన్ను కదిలించాయి

జూనియర్ ఎన్టీఆర్

ఓ జపనీస్ అభిమాని చెప్పిన మాటలకు చలించిపోయారు జూనియర్ ఎన్టీఆర్. ఆయన కొరటాల శివ దర్శకత్వంలో నటించిన 'దేవర' చిత్రం నేడు జపాన్‌లో విడుదలవుతోంది. అక్కడ నిర్వహించిన సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో ఎన్టీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుధ పూజ పాటకు ఓ అభిమానితో కలసి స్టెప్పులేసిన వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. కాగా, తన జపాన్ పర్యటనపై ఆనందం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు ఎన్టీఆర్. "ఆర్ఆర్ఆర్ సినిమా చూసిన తరవాత తెలుగు నేర్చుకున్నానని ఓ జపనీస్ అభిమాని చెప్పడం నన్ను కదిలించింది. విభిన్న సంస్కృతులతోపాటు భాష నేర్చుకునేందుకు సినిమా దోహదపడుతున్నందుకు సంతోషిస్తున్నా. ఇలాంటి వాటి కోసమే భారతీయ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాం' అని పేర్కొన్నారు.

సినిమాగా డొక్కా సీతమ్మ కథ



అన్నపూర్ణగా, అన్నదాతగా చరిత్రలో నిలిచిపోయిన గొప్ప మహిళ డొక్కా సీతమ్మ. ఏ సమయంలోనైనా తన ఇంటికి ఎంతమంది వచ్చినా.. లేదు.. అనకుండా వారికి తనే స్వయంగా వండి వడ్డించిన ఆ మహాతల్లి జీవిత కథ ఇప్పుడు సినిమాగా వస్తోంది. అయితే చిత్ర నిర్మాణం ప్రారంభం కాకముందే ఈ ప్రాజెక్ట్ విషయంలో వివాదం మొదలైంది. దాని గురించి రచయిత రామకృష్ణ మాట్లాడుతూ 'సీతమ్మ కథను 'అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో మొదట నాటకం రాశాను. 2016లోనే డొక్కా సీతమ్మ సినిమా స్క్రిప్ట్‌ను తెలుగు సినీ రచయితల సంఘంలో రిజిస్టర్ చేశాను. ఎంతో కాలంగా ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి చరిత్రను పరిశోధించి స్క్రిప్ట్ తయారు చేశాను' అని చెప్పారు. చరిత్ర సాకుతో తమ రచనను కాపీ కొడుతూ వేరొక సంస్థ కూడా సినిమా తీయడానికి ప్రయత్నించడంతో ఈ వివాదం కోర్టుకు చేరిందని నిర్మాత ప్రభాకర్ గౌడ్ చెప్పారు. కాపీ రైట్ యాక్ట్ కింద తమకు హక్కు ఉన్నప్పటికీ విషయం కోర్టులో ఉన్నందువల్ల తాము కోర్టు తీర్పును శిరోధార్యంగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. అయితే వేరొక సంస్థ సినిమా తీసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అదే నిజంగా జరిగితే కోర్టు ధిక్కారం అవుతుందని ఆయన హెచ్చరించారు. కోర్టు తేల్చే వరకూ యథాతథ పరిస్థితిని కొనసాగించాలని కోరారు.



వివరాలు తెలియజేస్తున్న డాక్టర్ వివేక్, పక్కన కోలుకున్న రోగి

కిమ్స్ హాస్పిటల్స్‌లో..

క్లిష్టమైన మెదడు శస్త్రచికిత్స

గుంటూరు మెడికల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో క్లిష్టమైన పక్షవాత కేసుకు అరుదైన రీతిలో కెరోటిడ్ ఆర్టరీ స్టెంట్, ఎన్యూరిజమ్ కాయిలింగ్ విధానంతో విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. గురువారం కిమ్స్ హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను తెలిపారు. 76 సంవత్సరాల రోగి పక్షవాతం బారిన పడి చికిత్స పొందుతున్నా, శరీర భాగం తరచూ బలహీనతనకు గురికావడం, ఇతర ఇబ్బందులు ఏర్పడుతుండటంతో ఇటీవల కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో చేరారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్ కుమార్‌రెడ్డి రోగిని పరీక్షించి మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే కెరోటిడ్ ధమనుల్లో కొవ్వు పేరుకుపోయినట్లు గుర్తించారు. న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్‌రావు నేతృత్వంలో బ్రెయిన్ యాంజియోగ్రామ్ చేయగా, మెదడు రక్తనాళం కూడా బలహీనపడి ఉబ్బి బుడగ మాదిరిగా మారినట్లు (ఎన్యూరిజమ్) గుర్తించారు. డ్యూయల్ యాంటీ ప్లేట్‌లెట్‌ల థెరపీ ఉపయోగించి రోగికి చికిత్స చేయాలని నిర్ణయించారు. ఇంటర్వెన్షనల్ స్పెషలిస్ట్ డాక్టర్ వివేక్, ఏకకాలంలో కెరోటిడ్ ఆర్టరీ స్టెంట్ వేయడంతోపాటు బ్రెయిన్ ఎన్యూరిజమ్‌కు కాయిలింగ్ పద్ధతిలో చికిత్స చేశారు. ఆపరేషన్ అనంతరం రోగి ఆరోగ్యపరంగా పూర్తిగా కోలుకున్నారు. సమావేశంలో ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజశేఖర్ మాలెంపాటి, సీవోవో సుధాకర్ పాల్గొన్నారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు

గుంటూరు సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని అన్ని రకాల ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపును అమలు చేయనున్నట్లు వాణిజ్య అధికారి డి వెంకటేశ్వర్లు తెలిపారు. కొన్ని రకాల చేనేత వస్త్రాలపై 50 శాతం వరకు తగ్గింపు కూడా ఇస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రజలందరూ సమీపంలో ఉన్న ఆప్కో విక్రయశాలలను సందర్శించి కావలసిన వెంకటగిరి, మాధవరం, రాజమండ్రి, బందరు, చీరాల, ఉప్పాడ చీరలు, ధోవతులు, దుప్పట్లు, లుంగీలు, షర్టింగ్, టవల్స్ తదితర చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



గుంటూరు-నడికుడి మార్గంలో రైళ్ల వేగం 130 కి.మీ

● రూ. 17.31 కోట్లతో ట్రాక్ వెంట సరిహద్దు గోడ నిర్మాణం ● టెండర్ల ప్రక్రియ ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - నడికుడి - పగిడిపల్లి సెక్షన్‌లో రైళ్ల వేగాన్ని 130 కిలోమీటర్ల కంటే ఎక్కువ చేసేందుకు రైల్వే శాఖ ఉపక్రమించింది. ఇప్పటివరకు 110 కిలోమీటర్ల గరిష్ట వేగానికే పరిమితమైన ఈ సెక్షన్‌ని అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం సెక్షన్‌లో ఎక్కడైతే రైలుపట్టాల పైకి ట్రెస్ పాసింగ్ జరగడానికి ఎక్కువగా అవకాశాలున్నాయో అక్కడ ట్రాక్ పొడవునా ప్రహరీగోడ నిర్మించేందుకు అన్ని అనుమతులను తీసుకొని టెండర్ల ప్రక్రియని ప్రారంభించింది. కొద్ది రోజుల్లో ఏజెన్సీలను ఖరారు చేసి రెండుగా విభజన చేసిన ఈ ప్రహరీగోడ నిర్మాణ పనులను కేటాయించనుంది. ఈ పనులు పూర్తి అయితే సెక్షన్ స్పీడ్ లిమిట్‌ని పెంచేందుకు అవకాశం ఉంటుందని రైల్వేవర్గాలు తెలిపాయి.

గుంటూరు రైల్వే డివిజన్‌లో ఏ సెక్షన్ చూసినా 130 కిలోమీటర్ల కంటే గరిష్ఠ వేగంతో రైళ్ల ప్రయాణించేందుకు అనుమతి లేదు. ఇందుకు కారణం డబ్లింగ్‌లు సంపూర్ణం కాక పోవడం, ఎక్కువ రద్దీ ఉండే నడికుడి మార్గంలో సింగిల్ లేన్ ఉండటమే. దీంతో ఒకదశలో వందేభారత్ లాంటి ప్రీమియం రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ వెనకడుగు వేసింది. అయితే ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులు, అధికారుల ప్రతిపాదనల మేరకు ఒకే ఒక్క వందేభారత్ (సికింద్రాబాద్ - తిరుపతి - సికింద్రాబాద్) రైలుని రైల్వేబోర్డు గుంటూరు డివిజన్ మీదగా నడిపేందుకు అనుమతించింది. మరోవైపు జోన్‌లోని ఇతర డివిజన్లు అయిన విజయవాడ, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్, గుంతకల్లులో ఎక్కువ వందేభారత్‌తో పాటు ఇతర ప్రీమియం రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి.

వీటిని పరిగణనలోకి తీసుకొన్న రైల్వే అధికారులు తొలుత గుంటూరు - నడికుడి - పగిడిపల్లి సెక్షన్‌ని 130 కిలోమీటర్ల వేగానికి మించి రైళ్ల ప్రయాణించేలా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఈ సెక్షన్‌లో డబ్లింగ్ ప్రాజెక్టు కూడా మంజూరైంది. దీంతో గుంటూరు - నడికుడి సెక్షన్‌లో 9.84 కిలోమీటర్ల పొడవునా ప్రహరీగోడ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ. 9.77 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ పనులను ఏడాదిన్నర లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. అలానే పగిడిపల్లి - నడికుడి సెక్షన్‌లో 7.56 కిలోమీటర్ల పొడవునా నిర్మించనున్న ప్రహరీగోడకు రూ. 7.53 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ పనిని కూడా పూర్తి చేసేందుకు 18 నెలల సమయాన్ని కేటాయించింది. ఈ రెండు సెక్షన్లలో ప్రహరీగోడ నిర్మాణ పనులు పూర్తయితే రైల్వేట్రాక్‌ల పైకి ట్రెస్‌పాసింగ్‌కు అడ్డుకట్ట పడుతుంది. దాంతో గరిష్ఠ వేగంతో రైళ్లు నడపడానికి ఆస్కారం ఉంటుంది.

చెరువులో పడి బీసీ హాస్టల్ విద్యార్థి మృతి



విద్యార్థి మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి వెంకటేశ్వర్లు, బంధువులు (ఇన్‌సెట్‌లో) కిశోర్

వట్టిచెరుకూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు గ్రామంలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ స్థానిక జడ్పీ హైస్కూల్లో 9 తరగతి చదువుతున్న బిక్కం కిషోర్(14) అనే విద్యార్థి హాస్టల్ సమీపంలోని మంచినీటి చెరువులో నీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. అదేప్రాంతంలో తోటి విద్యార్థులు ఇద్దరు స్నేహితుడిని కాపాడే ప్రయత్నంలో నీట మునిగి ప్రమాదంలో చిక్కుకున్నారు. వారిని అక్కడికి సమీపంలో ఉన్న 108 అంబులెన్స్ సిబ్బంది, గ్రామస్థులు కాపాడారు. ముందుగా నీట మునిగిన కిషోర్ జాడ కన్పించకపోవటంతో గ్రామసర్పంచ్ విజయకుమార్, ఉపసర్పంచ్ యడ్లపల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ భీమినేని కోటేశ్వరరావు, హాస్టల్ వార్డెన్, గ్రామస్థుల సహకారంతో చెరువులో వెతకగా అప్పటికే విద్యార్థి కిషోర్ మృతి చెందినట్టుగా గుర్తించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. హాస్టల్ విద్యార్థి చెరువులో మునిగి మృతి చెందడంతో తోటి విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నీటిమునిగిన విద్యార్థి కిషోర్ ఐదు సంవత్సరాలుగా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్‌లోనే ఉంటూ చదువుకుంటున్నాడు. సంఘటన తెలిసిన వెంటనే సీఐ రమానాయక్, హాస్టల్ వార్డెన్ నుంచి బాలుడి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. వివరాల్లోకి వెళితే పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గంగలకుంటకు చెందిన బిక్కం వెంకటేశ్వర్లు, రాములుకు ముగ్గురు కుమారులు. మూడో కుమారుడు మృతుడు కిషోర్ ఐదు సంవత్సరాలుగా ఇదే హాస్టల్‌లో ఉంటూ జడ్పీ హైస్కూల్లో చదువుతున్నాడు. సీఐ నుంచి బాలుడి ఘటన వివరాలు తెలుసుకున్న వెంటనే తల్లి రాములు స్పృహ కోల్పోయింది. తండ్రి, బంధువులతో కలసి హుటాహుటీన వట్టిచెరుకూరు చేరుకున్నారు.

గురువారం ఉదయం హాస్టల్‌కు నీరు రాకపోవటాన్ని గుర్తించి విద్యార్థులు వార్డెన్ సాంబశివరావుకు చెప్పారు. దీంతో పంచాయతీ వారిని సంప్రదించగా ప్రస్తుతం మోటారు రిపేర్లు చేస్తున్నామని, కొద్ది సమయంలో నీరు ఇస్తామని నీరు విడుదల చేసే వ్యక్తి చెప్పాడు. నీరు అత్యవసరమని అనటంతో వార్డెన్ సాంబశివరావు చెరువు దగ్గరకు వెళ్ళి కొంచం నీరు తెచ్చుకోండని చెప్పటంతో మృతుడు కిషోర్, అతనితో పాటు మరో ఇద్దరు విద్యార్థులతో కలసి మంచి నీటి చెరువులో నీరు తెచ్చుకొనే ప్రయత్నంలో కాలు జారి కిషోర్ నీటిలోకి జారాడు. తోటి విద్యార్థులు కిషోర్‌ను కాపాడే ప్రయత్నంలో వారు కూడా నీటిలో మునిగి పోవటాన్ని సమీపంలో ఉన్న 108 సిబ్బంది పెద్దగా కేకలు వేస్తూ తోటి వారి సాయంతో ఇద్దరు విద్యార్థులను కాపాడారు. గ్రామస్థుల సహకారంతో అదే ప్రాంతంలో వెతకటం ప్రారంభించగా అప్పటికే కిషోర్ మృతి చెందటాన్ని గుర్తించి మృత దేహాన్ని ఒడ్డుకు చేర్చారు. సంఘటన తెలిసిన వెంటనే బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మయూరి, ఎంపీడీవో రవిబాబు, డీటీ దరియావలి ఆ ప్రాంతానికి చేరుకొని సంఘటనా తీరును పరిశీలించి మృతుని తండ్రిని ఓదార్చిన అనంతరం మృత దేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. మృతుడి తండ్రి విలపిస్తుండగా బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మయూరి అయనను ఓదారుస్తూ జరగరాని ఘోరం జరిగింది, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామంటూ స్థానిక హాస్టల్ వార్డెన్ సాంబశివరావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలంటూ ఆమె లిఖిత పూర్వకంగా సూచించారు.

విద్యార్థి దుర్మరణం బాధాకరం : మంత్రి సవిత

●వార్డెన్ సస్పెన్షన్‌కు ఆదేశం

గుంటూరు (విద్య), మార్చి 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ విద్యార్థి కిశోర్ చెరువులో పడి దుర్మరణం పాలవ్వడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థులపై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని మంత్రి ఆదే శించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదవ శాత్తు గురువారం ఉదయం చెరువులో పడి కిశోర్ దుర్మరణం పాలవ్వడం బాధాకరమన్నారు. విద్యార్థి తల్లిదండ్రులకు మంత్రి సవిత తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. దుర్ఘటనకు గల కారణాలపై విచారణకు ఆదేశించామన్నారు.

విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోండి

హాస్టల్ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని వార్డెన్లకు, ఇతర సిబ్బందికి మంత్రి సవిత స్పష్టం చేశారు. ప్రభుత్వంపైనా, అధికారులపైనా నమ్మకంతో తమ పిల్ల లను హాస్టళ్లలో చేర్పుతున్నారన్నారు. తల్లిదండ్రులు కంటనీరు పెట్టకుండా, గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత హాస్టల్ సిబ్బందిపై ఉందన్నారు. వట్టిచెరుకూరు వంటి ఘటనలు జరగడం క్షమించరాని నేరమన్నారు.

రూ. 13 కోట్లతో డీసీఎంఎస్ బడ్జెట్ ఆమోదం



జేసీ భార్గవ్‌తేజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఎం హరగోపాల్

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ది గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 13 కోట్లతో బడ్జెట్ ఆమోదం లభించింది. మెడికల్ కళాశాల రోడ్డులో వున్న కార్యాలయంలో డీసీఉఎంఎస్ పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎ భార్గవ్‌తేజ అధ్యక్షతన గురువారం మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా జేసీ అధ్యక్షతన బడ్జెట్‌కు సంబంధించిన వివరాలను, సొసైటీ ముఖ్య లక్ష్యాలను బిజినెస్ మేనేజర్ హరగోపాల్ ప్రసంగించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ 2025-26కు సంబంధించి రూ. 13 కోట్లతో బడ్జెట్‌ను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సభ్యులెవరూ అభ్యంతరాలు తెలియజేయకపోవటంతో బడ్జెట్‌ను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో కార్యాలయ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులున్నారు. అలానే జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సమావేశం పర్సన్ ఇన్‌ఛార్జ్, జేసీ ఏ భార్గవ్‌తేజ అధ్యక్షతన గురువారం బ్రాడీపేటలోని బ్యాంకు కార్యాలయంలో జరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 535 కోట్లతో బడ్జెట్ ఆమోదానికి తీర్మానం చేశారు. బ్యాంకు సీఈవో కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె బడ్జెట్‌కు సంబంధించిన అంశాలను చదివి సభ్యులకు వినిపించారు. బడ్జెట్ ఆమోదం తెలపాలని సభ్యులను కోరగా ఎవరూ అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవటంతో ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు.

తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రేమ పెళ్లి చేసుకున్న బీటెక్ విద్యార్థి

- 8 నెలలు తిరగకుండానే పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కిన బాధితురాలు

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : 9వ తరగతి చదువుతున్న బాలికను బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. బాలికను పెళ్లి చేసుకుని ఆమె ఇంట్లోనే కాపురం కూడా ఉంటున్నారు. ఆ యువకుడు కాలేజీకి, బాలిక స్కూల్‌కు వెళ్తూనే ఉన్నారు. పెళ్ళై ఎనిమిది నెలలు కూడా గడవక మునుపే బాలిక పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది... ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ వెనుక ప్రాంతానికి చెందిన కోడూరి సంజయ్ (19) బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్తంభాల గరువు ప్రాంతానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని (14)తో పరిచయం ఏర్పడి ఇరువురు ప్రేమించుకుని పెద్దలకు తెలియకుండా పెళ్లి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు వారి పెళ్లిని అంగీకరించి, వారువురిని తమ ఇంటిలోనే ఉంచుకున్నారు. ఇరువురు మేజర్లు అయ్యేవరకు చదువుకునేలాగా బాలిక కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈ క్రమంలో బాలిక స్కూలుకు, సంజయ్ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. అయితే ఇటీవల బాలిక తన ఫోన్లో వేరే వారితో చాట్ చేస్తుండడం గమనించిన సంజయ్ విషయాన్ని తన అత్తమామలకు చెప్పాడు. బాలికను మందలించకపోగా సంజయ్‌ను తప్పుపట్టారు. ఈ విషయమై రెండు కుటుంబాల మధ్య వివాదం నెలకొనగా బాలిక తరపు వారు సంజయ్ కుటుంబ సభ్యులపై దాడి చేసి కొట్టారు. ఈ క్రమంలో సంజయ్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా మైనర్‌ని పెళ్లి చేసుకున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఇరువర్గాలను పిలిపించి విచారించగా సంజయ్ మైనర్‌ను వివాహం చేసుకున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో బాలిక కుటుంబ సభ్యుల నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకొని సంజయ్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిలకలూరిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట బైపాస్ రోడ్ లో గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం సిద్దవరం గ్రామానికి చెందిన చప్పిడి రమేష్(25), అతడి చిన్నాన్న కొడుకు చప్పిడి చిన్న(19) ద్విచక్ర వాహనంపై వెళ్తూ వారి ముందు వెళుతున్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొట్టారు. దీనితో ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న చప్పిడి రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. చప్పిడి చిన్న తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎంపీపీగా జబీన్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ప్రిసైడింగ్ అధికారి పి.శంకర్

దుగ్గిరాల ఎంపీపీగా షేక్ జబీన్

దుగ్గిరాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ఎంపీపీ ఎన్నికలో చిలువూరు ఎంపీటీసీ షేక్ జబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జబీన్‌కు బీసీ ధ్రువీకరణ పత్రం ఇవ్వకపోవడంతో సంఖ్యాబలం లేకపోయినప్పటికీ వైసీపీ సభ్యురాలు ఎంపీపీగా ఎంపికైన విషయం విధితమే. గురువారం జరిగిన ఎన్నికలో ఎంపీపీగా జబీన్‌ను ఎన్నుకున్నారు. వైసీపీ సభ్యులు గైర్హాజరు కాగా, టీడీపీ సభ్యులు తొమ్మిది మంది, జనసేన సభ్యురాలు ఒకరు మొత్తం పదిమంది సభ్యులు హాజరుకావడంతో ఎన్నికకు అవసరమైన కోరం లభ్యమైంది. ఎన్నికల అధికారి డ్వామా పీడీ పి.శంకర్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుల హాజరు తీసుకున్న ప్రిసైడింగ్ అధికారి ప్రతిపాదించే సభ్యుడు, బలపరిచే సభ్యుడు ముందుకు రావాలని కోరారు. గొడవర్రు సర్పంచ్ విశ్వనాధపల్లి శివకుమార్, ఎంపీపీగా పోటీ చేసేందుకు టీడీపీ నుంచి బీఫారం అందుకున్న, చిలువూరు ఎంపీటీసీ జబీన్ పేరును ప్రతిపాదించగా రేవేంద్రపాడు ఎంపీటీసీ కొప్పుల మధుబాబు ఎంపీపీగా బలపరుస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికకు హాజరైన సభ్యులందరూ జబీన్ ఎన్నికకు ఆమోదం తెలిపారు. జబీన్ దుగ్గిరాల ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ చంద్రమోహన్, టీడీపీ, జనసేన ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 13న పరీక్ష

యడ్లపాడు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్ష వాయిదా వేసినట్లు బోయపాలెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 6వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రకటన జారీచేసిందన్నారు. అయితే ఆ రోజు శ్రీరామనవమి పండుగ కావడంతో పరీక్షను వాయిదా వేసిందన్నారు. తిరిగి ఏప్రిల్ 13వ తేదీ ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించిందని, ఉదయం 5వ తరగతి ప్రవేశాలకు, మధ్యాహ్నం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు గమనించి పరీక్షలకు సన్నద్ధం కావాలని కోరారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 521.40 అడుగులు ఉంది. కుడికాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 16,595 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 25,123 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పరిహారానికి దరఖాస్తు గడువు పొడిగింపు

బాపట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఈశ్రమ గుర్తింపు కార్డు కలిగిన అసంఘటిత రంగ కార్మికులు 26-08-2021 నుంచి 31-03-2022 సంవత్సరకాలంలో ప్రమాదవశాత్తు మరణించిన, పూర్తి వైకల్యానికి గురైన పరిహారం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31వ తేది వరకు గడువు పొడిగించినట్లు కార్మికశాఖాధికారి సాయిజ్యోతి తెలిపారు. ప్రమాద మరణానికి రూ.2లక్షలు, పూర్తి వైకల్యానికి రూ.లక్ష మంజూరు చేస్తారన్నారు. ధరఖాస్తు చేసుకొని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలకు చెందినవారు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు కార్మికశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రంగస్థలం పాత్ర అజరామరం

● డాక్టర్ పీసీ సాయిబాబు



ప్రముఖ రంగస్థల నటుడు శాయిని సత్కరిస్తున్న పీసీ సాయిబాబు, చిత్రకారుడు జీవి

బాపట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వినోదం కోసం మనకున్న ఐచ్ఛికాలల్లో రంగస్థలం అజరామరమైనదని ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు పేర్కొన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో గురువారం సుప్రసిద్ధ రంగస్థల నటుడు కేఎస్‌టీ శాయిని సన్మానించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ దర్శకుడిగా, నటుడిగా, రచయితగా శాయి నాలుగు దశాబ్దాలపాటు రంగస్థలాన్ని ఏలారన్నారు. అటువంటి గొప్ప రంగస్థల కళాకారుడిని సన్మానించుకోవటం బాపట్లను గౌరవించుకోవటమేనన్నారు. కార్యక్రమంలో చిత్రకారుడు జీవి, రంగస్థల నటుడు బాషా పాల్గొన్నారు.

విజ్ఞానయాత్రకు బాపట్ల విద్యార్థులు

బాపట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష, విద్యాశాఖా ఆధ్వర్యంలో బాపట్ల నుంచి 120మంది విద్యార్థులను విజ్ఞానయాత్రకు తీసుకెళుతున్నారు. గురువారం బాపట్ల పబ్లిక్ స్కూల్ దగ్గర నుంచి 3బస్సుల్లో విద్యార్థులను తీసుకెళ్లే కార్యక్రమాన్ని కలెక్టర్ జె.వెంకటమురళి జెండా ఊపి ప్రారంభించారు. రెండు రోజులపాటు విజ్ఞాన యాత్రం జరుగుతుందని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా, ఏఎంవో డాక్టర్ బి.మోజెష్, ఎండీ సాధిక్ తదితరులు ఉన్నారు.

అహ్మద్‌ఖాన్‌కు ఘన నివాళి

బాపట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే వెనుకబడిన వర్గాల అభ్యున్నతి సాధ్యమని భావించి ఎన్నో అవమానాలు భరించి ఆలిఘడ్ యూనివర్శిటిని స్థాపించిన విద్యావేత్త సయ్యద్ అహ్మద్‌ఖాన్ చిరస్మరణీయులని అబ్దుల్‌కలాం ఫౌండేషన్ చైర్మన్ పఠాన్ రాజేష్ పేర్కొన్నారు. అహ్మద్‌ఖాన్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం అబ్దుల్‌కలాం ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి సేవలను కొనియాడారు.

శివాలయంలో కల్యాణోత్సవాలు

కర్లపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం శ్రీగంగా గౌరీ సమేత బదరి కేదారేశ్వరస్వామి శివాలయంలో వార్షిక వేడుకల్లో భాగంగా గురువారం శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాసుదేవశాస్త్రి, కోటప్పకొండ కృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో ఇసుకపల్లి మారుతి వాణిగాయత్రి, బండాత్మకూరు రమాకాంత్‌శర్మ, శుభశ్రీ, శ్రీరామచంద్రమూర్తి సుస్మిత దంపతులు కల్యాణ పూజలు చేశారు. ఈ సందర్భంగా గణపతిపూజ, అభిషేకాలు, హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా మట్టి రవాణా

● మూడు ట్రాక్టర్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను చూపుతున్నఎస్ఐ భార్గవ్

నగరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపూడిగ్రామ శివారులో అనుమతులు లేకుండా మట్టి తవ్వి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను నగరం ఎస్ఐ బండ్ల భార్గవ్ అదుపులోకి తీసుకున్నారు. మట్టి ట్రాక్టర్లకు ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండా మట్టిని రవాణా చేస్తున్నట్లు నిర్ధారణ చేసుకుని సదరు ట్రాక్టర్లును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి ఈఘటనపై నగరం తహసీల్దార్ నాంచారయ్య కొన్ని నివేదికలు పంపించామని తెలిపారు. అధికారుల సూచనల ప్రకారం అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, రవాణా చేసినట్లయితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై విచారణ జరపాలి

● దళిత సంఘాలనాయకులు

బాపట్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేసి వాస్తవాలు తెలియజేయాలని బాపట్లజిల్లా దళిత బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో మోకాళ్ళపై నిలబడి నిరసన తెలియజేశారు. ప్రవీణ్‌కుమార్ మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.చార్వాక, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, మాలమహానాడు రాష్ట్రఅధికారప్రతినిధి శీలం రోజన్‌బాబు, పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు గుడిపాటి మోజెస్, దళితనాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతికి కృషి చేస్తున్న నాయకుడు చంద్రబాబు

● వెలుగు సిబ్బంది తీరు మారకపోతే చర్యలు

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరులో పీఎం అజయ్ ఉన్నతి రుణాల చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రధానమంత్రి అజయ్ ఉన్నతి రుణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వెలుగు ప్రాజెక్టు ఏరియా కో-ఆర్డినేటర్ ఎం రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సృష్టికర్త చంద్రబాబునాయుడు అని దేశంలోనే మొట్టమొదటిగా మహిళల కోసం సముచిత ఆలోచన చేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారన్నారు. గత 9 నెలల నాడు జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మహిళలు అఖండ విజయాన్ని అందించారన్నారు. మహిళలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలను కల్పించడానికి ప్రణాళికను సిద్ధం చేసిందన్నారు. పలు పథకాల ద్వారా మహిళలను ఉన్నత స్థానానికి తీసుకు వెళతామన్నారు. జగన్ ప్రభుత్వంలో వ్యవస్థ పూర్తిగా నాశనమైందని, ఆనాడు డీఆర్‌డీఏ వెలుగు పథకంలో పని చేసిన ఉద్యోగులు జగన్‌కు తొత్తులుగా వ్యవహరించారని విమర్శించారు. కూటమి పాలన వచ్చి 9 నెలలు దాటినా ఆ శాఖలో పని చేసే సిబ్బంది గత ప్రభుత్వంలో వ్యవహరించిన తీరులోనే నడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సిబ్బంది తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఉన్నతి పథకం ద్వారా నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 13మంది ఎస్సీ మహిళా లబ్ధిదారులకు రూ.23 లక్షల చెక్కును పంపిణీ చేశారు. స్త్రీనిధి విభాగం బాపట్ల జిల్లా ఏజీఎం నాగబాబు మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా ఒక్కొక్క మహిళకు లక్ష రూపాయల వరకు ఈ పథకం ద్వారా అందింది. ఒక్కొక్కరికి రూ.50 వేలు సబ్సిడీ ఇవ్వడంతో పాటు లబ్ధిదారులు కేవలం 10 శాతం డబ్బు చెల్లిస్తే సరిపోతుందన్నారు. సంబంధించిన రుణాన్ని జీరో వడ్డీ ద్వారా వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేందుకు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, రాష్ట్ర నాయకులు తూనుగుంట్ల సాయిబాబా, గొట్టిపాటి భానుగంగాధర్, ఏపీఎంలు, సీసీలు, ఉన్నతి లబ్ధిదారులు, యానిమేటర్లు పాల్గొన్నారు.

● రూ.7,99,003ల చెక్కుల పంపిణీ

కొల్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. గురువారం గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొల్లూరు మండలానికి చెందిన 17మంది వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొందారు. వారంతా తమ ఆర్థిక పరిస్థితి ఎమ్మెల్యేకు వివరించగా ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేశారు. సీఎంఆర్‌ఎఫ్ కార్యాలయం నుంచి అందిన రూ.7,99,003ల చెక్కులను బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబు, టీడీపీ నేత ఝెనేని మురళీకృష్ణలకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. పంపిణీ కార్యక్రమంలో కొల్లూరు నాగశ్రీధర్, నాగళ్ల కృష్ణారావు, సుంకర శ్రీను, బోయపాటి తేజ, పెదపూడి నాగరాజు, యడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముప్పలనేని శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు

బాపట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం, ఆంధ్రప్రదేశ్ అకాడమి ఆఫ్ సైన్సెస్ అమరావతివారు సంయుక్తంగా అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. కళాశాలలో గురువారం 'ఏఐ-డ్రివెన్ కెమిస్ట్రీ ఇన్నోవేషన్స్ ఇన్ నెక్స్ జనరేషన్ స్మార్ట్ మెటిరియల్స్, ఫార్మాస్యూటికల్స్ అండ్ హెల్త్‌కేర్ 2025' అనే అంశంపై నిర్వహించిన సదస్సును బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ రమాదేవి అధ్యక్షతన జరిగిన సదస్సులో హైదరాబాద్ సీఎస్ఐఆర్ - ఐఐసీటీ సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఎల్ గిరిబాబు బాపట్ల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ టీఈ గోపాలకృష్ణమూర్తి, జేఎన్‌యూ న్యూఢిల్లీ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్ సోమేశ్వరరావు, సౌది ఆరేబియా యూనివర్సిటి అసోసియేట్ రీసెర్చ్ ప్రొఫెసర్ బి.రత్నసునీల్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని విలువైన సందేశాలు అందించారు. 220మంది పరిశోధకులు, విద్యార్థులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొని తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి పరిశోధకులు హాజరై తమ పరిశోధన అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో భాగంగా పోస్టర్ ప్రజంటేషన్స్ సారాంశాలు, పరిశోధనపత్రాలు పొందుపర్చారు. శాస్త్రవేత్త ఎల్ గిరిబాబు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ఆధారిత రసాయన పరిశోధన రసాయనశాస్త్రం, మెడిసిన్, మెటిరియల్ సైన్స్, ఫార్మాసూటికల్స్ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులకు దారితీస్తుందన్నారు. స్మార్ట్‌మెటిరియల్స్ రూపకల్పనలో ఎ-1 వినియోగం భవిష్యత్తు పరిశోధనలకు గొప్ప మార్గదర్శిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ రమాదేవి, చెన్నంశెట్టి సుబ్రహ్మణ్యం, వి.మాధవరావు, కె.ప్రసాదరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

చట్టాలపై ఖైదీలకు అవగాహన

రేపల్లె, మార్చి 27(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల కారణంగా ఖైదీలుగా మారిన మీరు సత్ప్రవర్తనతో నడుచుకుని మీ కుటుంబాలకు అండగా నిలవాలని సీనియర్‌సివిల్‌జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక సబ్ జైలును సందర్శించి ఖైదీల సౌకర్యాలు, ఆహార, మెడికల్ సదుపాయాలు, లీగల్ ఎయిడెడ్ సౌకర్యాలు వారి కేసులను వాటి వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లోన్‌మేళాకు 233 దరఖాస్తులు

చుండూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కార్యాలయంలో గురువారం లోన్ మేళా నిర్వహించినట్లు ఎంపీడీవో సుదీప తెలిపారు. బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, రెడ్డి, వైశ్య కార్పొరేషన్‌కు అర్హులైన అభ్యర్థులు రుణాలు పొందడానికి దరఖాస్తులు స్వీకరించారన్నారు. మొత్తం 233 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వివిధ బ్యాంకులకు చెందిన బ్యాంకర్ల సెలక్షన్స్ కమిటీ సభ్యులు మండల అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు.

వెదుళ్ళపల్లి, స్టూవర్టుపురంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన

బాపట్లరూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం స్టూవర్టుపురం, వెదుళ్ళపల్లి గ్రామాల్లో గురువారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు పర్యటించారు. ముందుగా స్టూవర్టుపురంలో బాలుర గిరిజన సంక్షేమ పాఠశాల, హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. వెదుళ్ళపల్లి గ్రామంలో ప్రస్తుతం ఉన్న పూలమార్కెట్ భవనం, బాలికల గిరిజన సంక్షేమహాస్టల్ భవనం కావటంతో ఈ భవనాన్ని సంబంధితాధికారులు వెంటనే సంబంధితశాఖకు అప్పజెప్పాలని సూచించారు. స్టూవర్టుపురం గ్రామంలోని మహిళలు తమకు జీవనాధారం కోసం ఈ ప్రాంతంలో ఇండస్ట్రీ ఏర్పాటు చేయాలని అలా ఏర్పాటు చేసినట్లైతే నాటుసారా తయారికి జోలికిపోమని మాకు ప్రభుత్వం జీవనాధారం కల్పించాలని చైర్మన్‌కు తెలిపారు. వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపుతామని గ్రామస్థులకు శంకరరావు తెలిపారు. అనంతరం ఇటీవల నగరం మండలంలో, బాపట్ల మండలం హనుమంత్‌నగర్ గ్రామంలో గిరిజన బాలికలపై జరిగిన అత్యాచార ఘటనల్లో తమకు న్యాయం జరగలేదని బాధితులు ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, బాపట్ల తహసీల్దార్ సలీమా, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, దేవరకొండరాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి

● ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రాధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

బాపట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు ప్రభుత్వం వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రాధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. బాపట్ల ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో దామోదరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు 12వ పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి బీటీ వలి మాట్లాడుతూ ఈహెచ్ఎస్ ద్వారా క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అందేవిధంగా చూడాలన్నారు. నెల్లూరు జోనల్ అధ్యక్షుడు వాకా రమేష్ మాట్లాడుతూ 2019లో ఆర్టీసీ ఉద్యోగుల భద్రత కోసం తెచ్చుకున్న సర్క్యులర్ 01/2019ను అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమానికి జిల్లా కౌన్సిల్ అధ్యక్షుడు పసుపులేటి చిరంజీవి అధ్యక్షత వహించగా జోనల్ నాయకులు ఝాన్సీ, ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు, నాలుగు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం బస్టాండ్ నుంచి ఎన్జీవో హోమ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అవినాష్‌కు సన్మానం



బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల అవినాష్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

బాపట్ల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కంచర్ల అవినాష్‌ను, కమిటీని గురువారం కోర్టు ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన కార్యవర్గం ఏకగ్రీవం కావటం సంతోషకరమని న్యాయవాదులు పేర్కొన్నారు. అధ్యక్షుడిగా అవినాష్, ఉపాధ్యక్షుడిగా కె.రవి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ రామాంజనేయులు, జాయింట్ సెక్రటరిగా ఎన్ శ్యామలాదేవి, కోశాధికారిగా బి.చిరంజీవి, మార్కెండేయులు, మహిళా ప్రతినిధిగా జి.సువర్ణ నాగమోహినిలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు యలవల నరేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

● బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు

బాపట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్‌ఈ విభాగం వారు గురువారం ఈటీఏపీ సాఫ్ట్‌వేర్‌పై రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ముప్పలనేని ప్రారంభించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఇటువంటి ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ పొందటం ద్వారా భవిష్యత్తులో విద్యార్థులకు ఉద్యోగవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ నిపుణులు చెప్పే సూచనలు పాటిస్తూ విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్ రమాదేవి, ఈటీఏపీ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇంజనీర్ బాలాజి ఖన్నన్, కార్తీక్, తదితరులు ప్రసంగించారు.

పారిశుధ్య కార్మికులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

రేపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పారిశుధ్య కార్మికులపై వివక్ష చూపుతూ వ్యక్తిగత కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఏఐటీయూసీ నాయకులు గొట్టుముక్కల బాలాజీ ఆరోపించారు. గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్మికులపై ప్రవర్తించే తీరుకు నిరసనగా ఏఐటీయూసీ మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న మహిళలను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వేధిస్తున్నారని తక్షణమే విచారణ జరిపించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

ఉపసర్పంచ్‌గా శ్రీనివాసరావు ఎన్నిక



ధ్రువీకరణ పత్రంతో శ్రీనివాసరావు

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ బలపరిచిన ఉపసర్పంచ్ అభ్యర్థి గొర్రెపాటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. గురువారం మండలపరిధిలోని పెదపులివర్రు ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. టీడీపీ బలపరిచిన రెండో వార్డు సభ్యుడు శ్రీనివాసరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి ఆయనకు ఉపసర్పంచ్‌గా ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. భట్టిప్రోలు మండలపరిషత్ కో-ఆప్షన్ సభ్యుడిగా వైసీపీకి చెందిన సయ్యద్ నబీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన ఉపసర్పంచ్, కో-ఆప్షన్ సభ్యుడికి ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

పేటేరు ఉపసర్పంచ్ ఏకగ్రీవం



ఉపసర్పంచ్‌గా ఎన్నికైన శ్రీదేవికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఈవోపీఆర్డీ ప్రసాద్‌బాబు

రేపల్లె, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటేరు పంచాయతీకి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం 11గంటలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వింటి ప్రసాద్‌బాబు అధ్యక్షతన ఉపసర్పంచ్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవం అయిందని ఉపసర్పంచ్‌గా కనికచర్ల శ్రీదేవి ఎన్నికైనట్లు తెలిపారు. ఆమెకు ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు.

తుమ్మలపాలెం ఉపసర్పంచ్ ఏకగ్రీవం



ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఆర్వో శ్రీనివాసన్

చెరుకుపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం ఉపసర్పంచ్‌గా పెరుగు వెంకట శివనాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒప్పందంలో భాగంగా సంవత్సరం క్రితం ఈ స్థానానికి గత ఉపసర్పంచ్ రాజీనామా చేయడంతో ఆ ఎన్నికను గురువారం నిర్వహించారు. ఎన్నికైన శివనాగేశ్వరరావుని నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త గణేష్ అభినందించారు.

పిట్టలవానిపాలెం ఎంపీపీగా సీతారామరాజు



సీతారామరాజుకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ప్రిసైడింగ్ అధికారి విజయలక్ష్మి

పిట్టలవానిపాలెం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పిట్టలవానిపాలెం ఎంపీపీగా దెందుకూరి సీతారామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి సీహెచ్ విజయలక్ష్మి అందజేశారు.

సీపీఎస్ ఉద్యోగుల మ్యాచింగ్ గ్రాంటు జమ

● ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు

భట్టిప్రోలు(కొల్లూరు), మార్చి 27(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగుల మ్యాచింగ్ గ్రాంటు జమ చేసినందుకు ఏపీసీపీ ఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఏపీ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ విన్నపం మేరకు 2025 ఫిబ్రవరి వరకు సీపీఎస్ నెలవారీ చందాను ఉద్యోగుల పీఆర్ఏఎన్ అకౌంట్లకు జమ చేయడం హర్షణీయమన్నారు.

సుందరతీరాన తొలి సంకల్పం విజయవంతం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక పర్యాటక కేంద్రం అభివృద్ధికి తొలిసారిగా చేసిన కృషి ఫలించిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. శాసనసభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అసెంబ్లీలో పర్యాటక కేంద్రం అభివృద్ధిపై ప్రసంగించి సానుకూలస్పందన వచ్చేవిధంగా ప్రభుత్వాన్ని మెప్పించి ఒప్పించి సఫలీకృతులమైనట్లు తెలిపారు. తొలివిడతగా 97.52 కోట్ల రూపాయలు మంజూరు కావటం సంతోషకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బాపట్ల నియోజకవర్గ ప్రజలు తరపున కృతజ్ఞతలు తెలిపారు. చీరాల ఓడరేవు నుంచి బాపట్ల సూర్యలంక తీరాన్ని కలుపుతూ రాజధాని ఆవశ్యకతను తెలియజేస్తూ తాను చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసిందన్నారు. ఒక రమణీయ పర్యాటక కేంద్రంగా సూర్యలంకకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించి నిధులు మంజూరు చేయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, కేంద్ర మంత్రులకు నరేంద్రవర్మ కృతజ్ఞతలు తెలిపారు.

మసీదు కాంప్లెక్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన



మసీదు కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంకటపాలెంలో మక్కా మసీదు కాంప్లెక్స్‌ను గురువారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఏర్పాటు చేసిన షాపులను ప్రారంభించటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రావిపూడి నాగమల్లేశ్వరరావు, యార్లగడ్డ సుబ్బారావు, మద్దిరాల అన్నమ్మ, మల్లిబోయన గోపి, చుక్కా పరమేశ్వరరావు, వందనం, ఉమర్, మునీర్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్ : కలెక్టర్

బాపట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని కలెక్టర్ జె.వెంకమురళి తెలిపారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని గురువారం సాయంత్రం కాపు కల్యాణ మండపంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లిం పెద్దలతో కలిసి ప్రార్థనలు చేసి వారికి డ్రైఫూట్స్ తినిపించారు. ఇఫ్తార్‌లో వడ్డించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి షేక్.రోషన్‌జమీర్‌బాషా, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులుపాల్గొన్నారు.

మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతీసే యూనిట్ల ఏర్పాటు వద్దు

మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతీసే యూనిట్‌లు బాపట్ల-ప్రకాశం జిల్లాల మధ్య ఏర్పాటు చేయరాదని కోరుతూ మత్స్యకార సంఘం నాయకులు గురువారం కలెక్టర్ జె.వెంకటమురళికి వినతిపత్రం అందజేశారు. చినగంజాం మండలంలో షిప్ బ్రేకింగ్ యూనిట్, షిప్ కన్‌స్ట్రక్షన్‌యూనిట్ ఏర్పాటు చేసే విషయమై సర్వే చేస్తున్నారనే వదంతులు వస్తున్నాయని ఇవి వస్తే కాల్వలు, సముద్రతీరం కాలుష్యంతో నిండిపోయి జీవనోపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పుకొఠారు చేసుకొని జీవనం సాగిస్తున్న వేలాదిమంది జీవనోపాధి దెబ్బతింటుందన్నారు.

దూరప్రాంతాలకు ఆర్టీసీ సర్వీస్‌లు కేటాయించాలి

● ఆదర్శవేదిక కన్వీనర్ వై కిషోర్‌బాబు



మంత్రి సోదరుడు శివప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న పట్టణ ఆదర్శవేదిక నాయకులు

రేపల్లె, మార్చి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోకు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కొత్త బస్సులను తీసుకువచ్చారని వాటిని దూరప్రాంతాలకు వెళ్లే విధంగా సర్వీస్‌ల ను తిప్పాలని ఆదర్శవేదిక కన్వీనర్ వై కిషోర్‌బాబు తెలిపారు.గురువారం రెవెన్యూశాఖమంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్‌కు డిపోకు మంజూరైన కొత్తబస్సులను దూరప్రాంతాలకు తిప్పాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె డిపోకు 8 కొత్తబస్సులు వచ్చాయని ఆ బస్సులను రేపల్లె-శ్రీకాకుళం, రేపల్లె-తిరుపతి-బెంగుళూరు, రేపల్లె-హైదరాబాద్ స్లీపర్‌కోచ్ సర్వీస్‌లను తిప్పేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రేపల్లె నుంచి మోపిదేవి, చల్లపల్లి, మచిలీపట్నం వరకు బస్సులు తిప్పాలని కోరారు. హైదరాబాద్ నుంచి రేపల్లె వచ్చే సికింద్రాబాద్ ట్రెయిన్‌కు కనెక్షన్‌గా వచ్చేవిధంగా ఈ బస్సులను తిప్పితే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కలుగుతాయని తెలిపారు. వీటిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బైపాస్‌రోడ్డు నిర్మించాలంటూ ఆందోళన

బాపట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 216 డైవర్షన్ బైపాస్ రోడ్డు కోసం వెదుళ్ళపల్లి, బేతపూడి, స్టూవర్టుపురం గ్రామప్రాంత ప్రజలు గురువారం ఆందోళన చేశారు. జాతీయ రహదారిని కుందేరువైపుకు బైపాస్ నిర్వహించాలన్నారు. మూడేళ్ల క్రితమే ఈ రహదారిని నిర్మించారన్నారు. ఊరి మధ్యలో కాకుండా పక్కనే ఉన్న కుందేరువాగు వైపుకు డెవర్షన్ చేయాలని గతంలోనే పాలకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి పట్టించుకోవటంలేదన్నారు. పైగా రోడ్డు మధ్య డివైడర్‌లు లేకపోవటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కావున దీనిపై అధికారులు పరిశీలించి బైపాస్ నిర్మాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పులిపాక హరిప్రసాద్, రాగాల చినకోటేశ్వరరావు, అన్నం బాస్కర్, సాతులూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దగా పడుతున్న మిర్చి రైతులు

» నకిలీ విత్తనాల వద్ద నుంచి.. ధరల వరకు అదే పంథా
» ఆరుగాలం కష్టపడినా చేతికి వచ్చేది చిల్లి గవ్వే
» కొమ్మాలపాడు పరిసర గ్రామాల రైతుల ఆవేదన

అద్దంకి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మిర్చి రైతులు అవసరాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు నిలువునా ముంచుతున్నారు. సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు పరిసర గ్రామాలలో పెద్ద ఎత్తున మిరప సాగు చేస్తుంటారు. ఆయా గ్రామాలలో మిర్చి సాగు చేసే రైతులలో 70 శాతం మంది సన్న, చిన్న కారు రైతులు, కౌలు రైతులు ఉన్నారు. దీనికి తోడు ఈనాం భూములు కావడంతో బ్యాంక్‌లలో పంట రుణాలు కూడా అంతంత మాత్రంగానే ఇస్తున్నారు. దీంతో అత్యధిక శాతం రైతులు పెట్టుబడులకు వ్యాపారుల మీద ఆధార పడాల్సిందే. ఈ నేపథ్యంలో వ్యాపారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. నాణ్యత లేని విత్తనాలు మొదలు, పురుగు మందులు విక్రయిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గత్యంతరం లేక రైతులు వాటినే అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. ఇక పంట చేతికి వచ్చిన తరువాత పచ్చి మిర్చిని వ్యాపారుల కనుసన్నలలోని దళారులకే అమ్మాల్సి రావటం రైతులకు మరింత నష్టం చేకూర్చుతుంది. బహిరంగ మార్కెట్ కంటే మరింత తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగా ఉండే దళారులకే అమ్మాల్సి రావడం, బయట వ్యాపారులను స్థానికంగా కొనుగోలు చేసేందుకు రానివ్వకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో స్థానికంగానే అమ్మకాలు చేస్తున్నారు. దీంతో ఏటా రైతులు ఆందోళనలు



కొమ్మాలపాడు వద్ద లోడింగ్ చేస్తున్న పచ్చి మిర్చి బస్తాలు (ఫైల్)

చేయడం పరిపాటిగా మారింది. ఇది చాలదన్నట్లు స్థానికంగానే నకిలీ మిరప విత్తనాలను ప్రాసెసింగ్ చేయడం కూడా రైతులను మరింత ఆందోళన కలిగిస్తోంది. సమీప గ్రామాలలో పండే మిరప కాయల నుంచి విత్తనాలు తీసి ప్రాసెసింగ్ చేసి కంపెనీ లేబుల్స్ వేసి అమ్మకాలు చేస్తుండడం స్థానిక రైతులను కలవరపాటుకు గురిచేస్తుంది. పెద్ద కంపెనీల పేర్లతో స్థానింగా లభించే విత్తనాలను అమ్మకాలు చేస్తుండడం తెలుసుకున్న రైతులు విస్మయానికి గురవుతున్నారు. ఇలా విత్తనాల వద్ద నుంచి పురుగుమందులు, ఇతర పెట్టుబడుల వరకు స్థానిక వ్యాపారుల మీద ఆధారపడాల్సి రావడంతో ఆరుగాలం కష్టపడ్డా తీరా చేతికి వచ్చేది మాత్రం ఏమి ఉండడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు, మామిళ్లపల్లి, ఏల్చూరు, బల్లికురవ మండలం రామాంజనేయపురం, యస్‌యల్ గుడిపాడు తదితర గ్రామాల రైతులు ఎక్కువ విస్తీర్ణం లో మిరప సాగు చేస్తున్నారు. అదే సమయంలో కొమ్మాలపాడులోని వ్యాపారుల వద్ద పెట్టుబడులకు ఆశ్రయిస్తుంటారు. అధికారులు స్పందించి రైతులకు రుణాలు అందించే చర్యలు చేపట్టడంతో పాటు నకిలీ, కల్తీ విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



మామిళ్లపల్లి పొలాల్లో అనుమతులు లేకుండా ప్యాకింగ్ చేస్తున్న మిరప విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

బస్టాండ్‌లో ఊడిపడ్డ స్లాబు పెచ్చులు



బస్టాండ్‌లో 3వ నెంబర్ ప్లాట్‌ఫాం వద్ద ఊడిన స్లాబు పెచ్చులు

ఆందోళన చెందిన ప్రయాణికులు

అద్దంకి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని ఆర్టీసీ బస్టాండ్ లో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. గురువారం సాయంత్రం 3వ నెంబర్ ప్లాట్‌ఫాం వద్దకు బస్సు వచ్చిన సమయంలో శ్లాబ్ పెచ్చులు ఊడి పడ్డాయి. అయితే ఆ సమయంలో పెచ్చులు ఊడిపడ్డ ప్రాంతంలో ప్రయాణికులు లేకపోవడం, బస్సులో నుంచి ప్రయాణికులు దిగక ముందు ఆ ఘటన జరగడంతో ప్రమాదం తప్పింది. బస్సు అద్దాల పై పెచ్చులు ఊడిపడడంతో కొద్దిమేర పగిలింది. ఈ విషయాన్ని ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు దృష్టికి తీసుకు పోగా పెచ్చులు ఊడి పడ్డాయని, అయితే ఆ సమయంలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

గురుకుల పాఠశాలకు గ్రైండర్ అందజేత

అద్దంకిటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శింగరకొండ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల ఉన్నత పాఠశాలకు గ్రైండర్‌ను గురువారం అందజేశారు. అద్దంకిలోని శ్రీ రంగనాయకులు బుక్స్ అండ్ ఫ్యాన్సీ స్టోర్ అధినేత బుల్లిబాబు, విశ్రాంత ఉపాధ్యాయుడు వారణాసి రఘురామశర్మల సౌజన్యంతో గురుకుల పాఠశాలకు రూ.18000వేలతో గ్రైండర్‌ను అందజేయడం జరిగిందని క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. రోటరీ క్లబ్ సభ్యులకు ప్రిన్సిపాల్ దుర్గ గాయత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మురళిసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, దేవపాలన, చంద్రమౌళి, సందిరెడ్డి శ్రీనివాసరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యం

అద్దంకిటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా వాటర్ బెల్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టినట్లు ఎంఈవో-2 బూదాటి సుధాకరావు అన్నారు. గురువారం స్థానిక నంబూరివారిపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో వాటర్ బెల్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈక్రమంలో ఐఈఈఆర్‌డీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కిరణ్ విద్యార్థులకు వాటర్ బాటిళ్లను సమకూర్చగా, ఎంఈవో చేతుల మీదుగా వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మేదరమెట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీ కొని ఒకరు మృతి చెందిన ఘటన మేదరమెట్లలో గురువారం వేకువజామున జరిగింది. ఎస్సై మహమ్మద్ రఫి తెలిపిన వివరాల ప్రకారం మేదరమెట్ల బైపాస్‌లో రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మృతదేహం నుజ్జు నుజ్జు అయ్యి గుర్తుపట్టడానికి వీలులేకుండా పోయింది. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉండవచ్చని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

12న మార్టూరు యూనిట్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నిక

మార్టూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు యూనిట్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నిక వచ్చేనెల 12వ తేదీన మార్టూరులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహిస్తామని జిల్లా శాఖ అధ్యక్షుడు రావుల బాపయ్యచౌదరి తెలిపారు. అందుకు సంబంధించి గురువారం మార్టూరులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఎన్నికల షెడ్యూల్‌ను విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు యర్రగుంట కృష్ణమూర్తి విడుదల చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు షేక్ కమాలుద్దీన్, ఎం.పిచ్చయ్యశర్మ,చిట్టిబాబు పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ

అద్దంకి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శింగరకొండ రోడ్డులో కొత్త దామావారిపాలెం వద్ద ఉన్న ఊర్వశి వైన్స్‌లో చోరీ జరిగి సుమారు రూ.30వేలకు పైగా విలువైన నగదు, మద్యం బాటిళ్ల చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. శింగరకొండ రోడ్డులోని ఊర్వశి వైన్స్‌లో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత పైకప్పు రేకుకు రంధ్రం వేసి దొంగ లోపలకు ప్రవేశించాడు. కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.20వేల నగదు, 9 మద్యం బాటిళ్లను దొంగలించుకుపోయాడు. అదే సమయంలో సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించే వీలు లేకుండా డీవీఆర్‌ను కూడా ఎత్తుకెళ్లాడు. కేబుల్స్ కట్ చేసి ఉంది. ఉదయం షాపు తెరిచేందుకు వెళ్లగా చోరీ జరిగినట్లు గుర్తించారు. చోరీ జరిగిన మద్యం షాపును గురువారం ఉదయం ఎక్సైజ్ సీఐ భవాని పరిశీలించారు. చోరీకి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ సుబ్బరాజు తెలిపారు.

ఉప్పు భూములను పునరుద్ధరణ చేయండి

చినగంజాం, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం రైతులకు లీజుకు ఇచ్చిన భూములను పునరుద్ధరణ చేయాలని కోరుతూ చినగంజాం మండల పరిధిలోని ఏపీ స్టాల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ అసోసియేషన్, సాల్ట్ వర్కర్స్ కో-ఆపరేటవ్ ప్రొడక్షన్ అండ్ సేల్స్ సొసైటీ సభ్యులు గురవారం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించేందకు పెదగంజాం వచ్చిన జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. 750 కుటుంబాల వారు ఉప్పు భూములపై ఆధారపడి జీవిస్తున్న వారు ఉపాధిని కోల్పోతున్నారని, ఉప్పు



జేసీ ప్రఖర్‌జైన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

భూముల లీజు పునరుద్ధకణ చేయుట లేదా ప్రభుత్వ చట్ట ప్రకారం మా భూములను అభివృద్ధి కోసం ఎవరికైనా కేటాయిస్తే ప్రత్యామ్నాయంగా మాకు జీవనోపాధి కల్పించాలని, లేదా పట్టా, అసైన్డ్ భూములకు ఇచ్చే నష్ట పరిహారం మాకు కూడా ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాల్ట్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జయమ్మ, మాజీ ఎంపీపీ బీవీ.రమణారెడ్డి, ఏ.పీ సాల్ట్ మ్యానుఫాక్చరింగ్ అసోసియేషన్, సాల్ట్ వర్కర్స్ కోఆపరేటవ్ ప్రొడక్షన్ అండ్ సేల్స్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వసతి గదులకు రూ.1.20కోట్లు మంజూరు

బల్లికురవ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు అవసరమైన ఆరు వసతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1. 20 కోట్ల నిధులను మంజురు చేసింది. సమగ్ర శిక్ష ఏఈ రాజన్‌బాబు గురువారం కేజీబీవీ విద్యాలయం ఆవరణలో నూతన భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఆయనవెంట టీడీపీ నాయకులు మలినేని గోవిందరావు, విద్యాలయ ప్రిన్సిపాల్ కె.సరళకుమారి, కాంట్రాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

తిమ్మరాజుపాలెం ఉపసర్పంచ్‌గా వాసంతి

తిమ్మరాజుపాలెం(పర్చూరు), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపాలెం గ్రామ ఉపసర్పంచ్‌గా పాలపర్తి వాసంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో టీడీపీ ప్రజా కూటమి బలపరిచిన వాసంతిని సభ్యులు ఏకగ్రీవంగా



వాసంతికి నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

ఎన్నుకున్నారు. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన వాసంతికి ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు తెలిపారు. ఎన్నికల అధికారులుగా విద్యాశాఖాధికారి పి.వెంకటరామయ్య, ఈవోఆర్డీ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అచ్చెన్నకు ఏలూరి శుభాకాంక్షలు

పర్చూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు పుట్టినరోజు సందర్భంగా గురువారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో అచ్చెన్నను ఎమ్మెల్యే కలిసి శు భాకాంక్షలు తెలి పారు. వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేసి అభిమానం చాటుకున్నారు.



మంత్రి అచ్చెన్నకు వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

నేటితో ముగియనున్న పురుషుల జట్టు ఖోఖో శిక్షణ

పంగులూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఒడిశాలోని పూరి పట్టణంలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టు ఖోఖో శిక్షణ నేటితో ముగియనుంది. ఈ నెల 16న పంగులూరులోని ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీలో రాష్ట్ర స్త్రీ, పురుష రాష్ట్ర జట్ల ఎంపిక జరిగింది. ఎంపిక అనంతరం పురుషుల జట్టుకు పంగులూరు ఎంఎస్‌ఆర్‌అండ్ బీఎన్ఎం జూనియర్ కళాశాలలో ఖోఖో అకాడమీలో శాప్ కోచ్ డీఎల్ రెడ్డి జట్టుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 17 నుంచి ప్రారంభమైన జట్టు శిక్షణ 28వ తేదీ శుక్రవారంతో ముగియనుంది.

చీరాలలో సెంట్రల్ టీం!

» ఓ వ్యాపారి ఇంట్లో అరుదైన వన్యప్రాణి ఎముక ఉన్నట్లు ఢిల్లీ అధికారులకు సమాచారం
» నిందితులను పట్టుకునేందుకు సోదాలు
» ఎట్టకేలకు గుర్తింపు.. మిగతా వారి కోసం ఆరా
» అనుమానంతో పరారైన కుటుంబం

చీరాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అరుదైన వన్యప్రాణికి సంబంధించిన ఎముక ఇంట్లో ఉన్నట్లు ఢిల్లీ వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్, వైల్డ్ కంట్రోల్ క్రైం బ్యూరో బృందానికి సమాచారం అందడంతో గత శుక్రవారం పట్టణంలో గుట్టుచప్పుడు కాకుండా విచారణ జరిపి ఓ కుటుంబాన్ని గుర్తించారు. నిందితులు పట్టణంలో వ్యాపారం నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు స్థానిక ఫారెస్ట్ అధికారుల సహకారంతో పట్టణంలోకి ప్రవేశించిన సెంట్రల్ టీం సభ్యులు నిందితుని దుకాణం వద్దకు గత శనివారం సాధారణ కొనుగోలుదారులు మాదిరిగా వెళ్లారు. అతనితో మాటలు కలిపి ఇంకా ఏమేమి అమ్ముతారంటూ లోతుగా ఆరా తీశారు. ఈక్రమంలోనే అతని ఇంట్లో ఉన్న వన్యప్రాణి ఎముకను గుర్తించి, ఇది దేనికి ఉపయోగిస్తారని అడగ్గా క్షుద్రపూజలకు అంటూ సమాధానం ఇచ్చారు. ఎముక తమకు కావాలని వారు అడగ్గా తనతోపాటు ఇంకా తెలిసిన వారు ఉన్నారు. రేపు ఇస్తానని వ్యాపారి సమాధానమిచ్చినట్లు సమాచారం. దీంతో మరుసటి రోజు వారిని పిలిస్తే మాట్లాడదామని సెంట్రల్ బృందం అక్కడి నుంచి వచ్చేసింది. మరుసటి రోజు అధికారులు వెళ్లిచూడగా ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో అధికారులు స్థానికంగా ఆరా తీయగా.. రాత్రికి రాత్రే చెప్పాపెట్టకుండా కుటుంబం పరారైనట్లు తెలుసుకున్నారు. దీంతో సెంట్రల్ టీం, ఫారెస్ట్ అధికారులు తిరిగి వెళ్లిపోయారు. అయితే వచ్చిన వారు పోలీసులని తెలుసుకుని ఆ కుటుంబసభ్యులు మకాం మార్చినట్లు తెలుస్తోంది. ఈ ఘటన పట్టణంలో కలకలం రేపుతోంది. దీనిపై మార్కాపురం ఫారెస్టు స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా సెంట్రల్ టీం విచారణ కోసం వచ్చిన మాట వాస్తవమని, కేసు పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

విద్యార్థులపై శ్రద్ధతో మెలగండి

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

వేటపాలెం(చీరాల), మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యాలయాల్లో ఉన్న చిన్నారుల పట్ల శ్రద్ధతో మెలగాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. డీవీజీ శంకరరావు సూచించారు. గురువారం మండల పరిధిలోని వేటపాలెం బాలుర, బాలికల గురుకుల పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా చిన్నారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందరినీ ఉత్సాహపరిచారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా రాణించాలని సూచించారు. అంతకుముందు చైర్మన్‌ను తహసీల్దార్ పార్వతి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. శంకరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్ పార్వతి

యానాది సమస్యలపై ప్రత్యేక చొరవ

నిరాధారంగా జీవిస్తున్న ఎస్టీలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. శంకరరావు అన్నారు. గురువారం తహసీల్దార్ పార్వతితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. స్థానికంగా నివసిస్తున్న ఎస్టీ (యానాదు)ల వివరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా తహసీల్దార్ పార్వతి ఇప్పటికే మండల పరిధిలో 2200 మంది ఎస్టీలను గుర్తించినట్లు వివరించారు. అలాగే వారిలో ఆధార్ సమస్యలున్న 694 మందికి పరిష్కరించినట్లు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. వారి జీవన మనుడగపై ప్రత్యేక దృష్టి సారించి పథకాలందేలా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో డీటీ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల బకాయిలు చెల్లింపు

కూటమి ప్రభుత్వానికి ఉద్యోగుల కృతజ్ఞతలు

అద్దంకిటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గత సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న సీపీఎస్ ఉద్యోగులకు ప్రాన్ అకౌంట్స్‌లోని బకాయిలను ప్రభుత్వం చెల్లించడం పట్ల ప్రభుత్వానికి ఏపీసీపీఎస్ఈఏ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని రాష్ట్ర కౌన్సిలర్ దామా నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నూతలపాటి మార్క్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలోనే సీపీఎస్ ఉద్యోగుల ఇన్‌కం ట్యాక్స్ చెల్లించి పెండింగ్‌లో ఉన్న 2018 జూలై డీఏ, 2019 జనవరి డీఏ బకాయిలు, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న సరండర్ లీవ్ బకాయిలు కూడా విడతలో చెల్లించాలని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నామన్నారు. సీపీఎస్ ఉద్యోగులు స్వామి, వెంకయ్య, హనుమంతరావు, భక్తరాజు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం, గరటయ్యకాలనీలో శుక్రవారం పాత విద్యుత్ స్తంభాలను మార్చి కొత్త విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని టౌన్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆయా ప్రాంతాలలో ఉదయం 6 గంటల నుంచి సాయం త్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

సబ్ ట్రెజరీలో వార్షిక తనిఖీలు

చీరాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఉప ఖజానా కార్యాలయంలో గురువారం జిల్లా ట్రెజరీ, అకౌంట్ అధికారి ఆర్ శివకామేశ్వరి వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా సుదీర్ఘంగా పలు రికార్డులు, అటెండెన్స్ వివరాలు, పరిశీలించారు. అలాగే ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో లైఫ్ సర్టిఫికేట్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం పరిధిలో 3360 పెన్షన్లు ఉండగా వారిలో 200 లైఫ్ సర్టిఫికేట్స్ అందించడంలో జాప్యం ఉన్నట్లు తెలుసుకున్నారు. సకాలంలో వారి సర్టిఫికేట్స్ సేకరించి అప్‌లోడ్ చేయాలని ఇంచార్జి ఎస్టీవో ఎంవి సుబ్బారావుకు సూచించారు. ఆమె వెంట ఎస్టీవో మీరావలి, సిబ్బంది ఉన్నారు.

అద్దంకి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా పద్మావతి?

ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ

మేదరమెట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పి.గుడిపాడుకి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మందా నాగేశ్వరరావు కుమార్తె వరగాని పద్మావతి పేరు దాదాపు ఖరారైనట్లు తెలుస్తుంది. గురువారం పలువురు తెలుగుదేశం నాయకులకు ఐవీఆర్ఎస్ కాల్ ద్వారా వరగాని పద్మావతి ఏఎంసీ చైర్మన్‌గా మీకు అంగీకారమేనా, మీకు అంగీకారం లేకపోతే 1 నొక్కండి, అంగీకారమైతే 2 నొక్కండి మీరు ఈ విషయాన్ని మరలా వినదలచుకుంటే సున్నా నొక్కండంటూ ఫోన్లు వస్తున్నాయి. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దాదాపుగా పద్మావతి పేరును ఖరారు చేసినట్లు సమాచారం. మండలంలో సీనియర్ టీడీపీ నాయకులు మందా నాగేశ్వరరావు తొలి నుంచి మండలంలో పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు.

ఇంటర్ విద్యార్థిని ప్రవళిక ఆత్మహత్య

పంగులూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదవాడ గ్రామంలో ఇంటర్ విద్యార్థిని వలేరు ప్రవళిక (16) ఆత్మహత్య చేసుకుంది. రేణంగివరం ఎస్ఐ వినోద్‌బాబు సమాచారం మేరకు బూదవాడ గ్రామానికి చెందిన వలేరు ప్రవళిక స్థానిక పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. పరీక్షలు రాసిన అనంతరం గ్రామంలో మిరప కోతలు కోసే పనులకు వెళ్తోంది. ప్రవళిక తండ్రి అంజయ్య భార్యతో కలసి పొగాకు పనులకు వలస వెళ్లగా, ప్రవళిక పెద్దమ్మ రమాదేవి దగ్గర ఉంటూ బుధవారం ఉదయం మిరప కాయలు కోసే పనికి వెళ్లింది. ప్రవళిక మధ్యాహ్నం ఇంటికి వచ్చి కొంత సమయం తర్వాత బయటకు వెళ్లింది. మిరప కోతకు వెళ్లి ఉంటుందని భావించిన పెద్దమ్మ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో బంధువులతో కలసి వెతికింది. ఎంతకూ కనిపించక పోవడంతో తల్లిదండ్రులకు సమాచారం తెలిపింది. గురువారం ఉదయం గ్రామానికి చేరుకున్న అంజయ్య దంపతులు రేణంగివరం పోలీస్ స్టేషన్లో ప్రవళిక కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసిన ఎస్ఐ వినోద్‌బాబు తన సిబ్బందిని బృందాలుగా పంపి వెతికే ప్రయత్నం చేయగా గ్రామానికి చెందిన ఓ రైతు గ్రామానికి



ప్రవళిక మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

తూర్పు వైపున పంట పొలాల్లో బాలిక మృతదేహం ఉందని సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా ప్రవళిక నేల బావిలో శవమై కనిపించింది. బావి నుంచి బాలిక మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు పంచనామా పూర్తి చేసిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌బా బు తెలిపారు. బాలిక తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండడంతో కుటుంబ సభ్యులు మందలించడం తో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు.

ఘనంగా సినీనటుడు రాంచరణ్ జన్మదిన వేడుకలు

చీరాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలో ఘనంగా సినీ నటుడు రాంచరణ్ జన్మదిన వేడుకలను జనసేన పార్టీ, టీడీపీ కూటమి నాయకులు, అభిమాన సంఘాల ఆధ్వర్యంలో జరిగాయి. ఈసందర్భంగా ముందుగా దేశాయిపేట వృద్ధాశ్రమంలో కేక్ కటింగ్ నిర్వహించి అన్నదానం చేశారు. అనంతరం ఏరియా వైద్యశాలలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో శివరామప్రసాద్, గజవల్లి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, రాధారంగ మిత్ర మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.